RNI TELTEL2024/89323

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం – – 'వన్ హెల్త్.. వన్ ఫ్యూచర్' 8

నిజామాబాద్ | సెప్టెంబర్ 24 గురువారం 2026 | సంపుటి : 3 | సంచిక : 230 | పేజీలు : 8 | వెల రూ. 6.00/- | ఎడిటర్ : రాచమల్లు మాధవి

Nizamabad | THURSDAY SEPTEMBER 24 2026 | VOL:3 | ISSUE: 230 | PAGES:8 | Rs. 6:00 | EDITOR: Rachamallu Madhavi

# డీఏల పెండింగ్‌కు తెర.. రెండు విడతల్లో చెల్లింపులు

అక్టోబర్ జీతంతో తొలి డీఏ.. ఉగాది నాటికి రెండో డీఏ

ఉద్యోగ సంఘాలతో సీఎస్ భేటీ.. డీఏల విడుదలకు ప్రభుత్వం అంగీకారం

చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలకు పరిష్కారం

పీఆర్సీపై మాత్రం కొనసాగుతున్న ఉత్కంఠ

వేతన సవరణపై త్వరలో నిర్ణయం ఉంటుందన్న ఆశతో ఉద్యోగులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 23:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమై ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లపై చర్చించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న రెండు డీఏల విడుదలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఉద్యోగ సంఘాలు చాలాకాలంగా డీఏల విడుదల కోసం ప్రభుత్వాన్ని కోరుతున్న నేపథ్యంలో తాజా నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా డీఏను సకాలంలో విడుదల చేయాలని ఉద్యోగ సంఘాలు గతంలో పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాయి. ఈ క్రమంలో ప్రభుత్వం రెండు డీఏలను విడుదల చేసేందుకు అంగీకరించడం ఉద్యోగులకు కొంత ఊరటనిచ్చే అంశంగా మారింది.

(మిగతా 2వ పేజీలో..)

## 'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం': ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ ఫైర్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై వివాదం కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం అధికారులు చేస్తున్నది తప్పని వ్యాఖ్యానిస్తూ.. 'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం' అంటూ హెచ్చరించారు. 'ఓటు చోరీ' భారత ప్రజల పట్ల నేరమని, రాజ్యాంగంపై నేరుగా దాడి చేయడమేనని ఎక్స్‌లో పోస్టు చేశారు.ఓ వీడియోను కూడా రాహుల్ గాంధీ పంచుకున్నారు. "ఎన్నికల సంఘానికి, ఎన్నికల అధికారులకు స్పష్టంగా చెబుతున్నా.. మీరు చేస్తున్నది తప్పు. ఇది దేశద్రోహం. సమయం వస్తుంది. మిమ్మల్ని పట్టుకుంటాం. తప్పించుకోలేరు" అని అందులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలకు కారణమైన వివాదం ఓ పత్రిక ప్రచురించిన పరిశోధనాత్మక కథనంతో మొదలైంది. పది నెలల వ్యవధిలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆ కథనం పేర్కొంది. కొత్త ఓటర్ల చేర్పు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలు అందులో ఉన్నట్లు తెలిపింది.అయితే ఈ కథనాన్ని ఎన్నికల సంఘం తిరస్కరించింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై అభిప్రాయాలు, సూచనలు మాత్రమే చేశారని.. అధికారికంగా ఎలాంటి భిన్నాభిప్రాయం నమోదు కాలేదని ఈసీ వర్గాలు తెలిపాయి. 'సర్' సహా అన్ని నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఆమోదంతో ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు స్పష్టం చేశాయి. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. ఇటీవలి సంవత్సరాల్లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ పార్లమెంటరీ కమిటీ సమీక్షించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న 'సర్' ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరారు.




## తెలంగాణకు కర్ణాటక సీఎం గుడ్ న్యూస్... జూరాలకు నీటి విడుదలకు ఓకే

జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక అంగీకారం

బెంగళూరులో కర్ణాటక సీఎంతో తెలంగాణ మంత్రుల బృందం భేటీ

జూరాల కింద రైతుల ఇబ్బందులను వివరించిన మంత్రులు

(మిగతా 2వ పేజీలో..)



## సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే...!: ఎన్నికల కమిషన్‌పై ప్రియాంక గాంధీ తీవ్ర వ్యాఖ్యలు

ఎన్నికల రిగ్గింగ్ గురించి తెలిసి సీఈసీ అనుమతిస్తే దేశద్రోహమని వ్యాఖ్య

ఈ ఘటనపై సరైన దర్యాప్తు జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ఎన్నికల

(మిగతా 2వ పేజీలో..)



## బెంగాల్‌లో మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించండి.. సీఈసీపై విమర్శల నేపథ్యంలో మమత డిమాండ్

పాత ఓటర్ల జాబితాతో బెంగాల్‌లో మళ్లీ ఎన్నికలు జరపాలని మమత డిమాండ్

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేయాలని మమత వ్యాఖ్య

దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని మమత ప్రకటన

30 లక్షల ఓటర్ల పేర్లు తొలగించారని అభిషేక్ ఆరోపణ

ఇద్దరు ఈసీలు 'సర్'పై అభ్యంతరాలు తెలిపినట్లు వార్తల నేపథ్యంలో వ్యాఖ్యలు

పశ్చిమ బెంగాల్‌లో మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) వివాదం మరోసారి ముదురుతోంది. 'సర్' సహా ఓటర్ల తొలగింపు, చేర్పు వంటి కీలక నిర్ణయాలపై ఎన్నికల సంఘం కమిషనర్లు అభ్యంతరం వ్యక్తం

(మిగతా 2వ పేజీలో..)




## భారీ వర్షానికి దెబ్బతిన్న చార్మినార్.. ఊడిపడిన ప్లాస్టరింగ్

హైదరాబాద్‌లో భారీ వర్షాల కారణంగా చార్మినార్‌కు స్వల్ప నష్టం

లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడిపడిన వైనం

మరమ్మతుల కోసం ఇప్పటికే టెండర్ ప్రక్రియలో ఉందని ఏఎస్ఐ వెల్లడి

(మిగతా 2వ పేజీలో..)



## రైతుల పోరాటంతోనే ప్రభుత్వం దిగొచ్చింది: జూరాల నీటి విడుదలపై కేటీఆర్

జూరాల కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేసిన ప్రభుత్వం

పోరాడితో పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప అన్న కేటీఆర్

రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం దిగొచ్చిందని వ్యాఖ్య

జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు అధికారులు నీటిని విడుదల చేసిన పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. "పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప"

(మిగతా 2వ పేజీలో..)



## రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత

ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణమన్న కవిత

ఐదుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోతే రేవంత్ కు పరామర్శించే సమయం కూడా లేకపోయిందని మండిపాటు

నెల రోజుల్లోగా ప్రభుత్వ ఆసుపత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని హెచ్చరిక

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ లో చోటుచేసుకున్న ఏసీ పేలుడు ఘోర ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ

(మిగతా 2వ పేజీలో..)




## గణేశ్ నిమజ్జనం: 25న సెలవు, వేలాదిమంది పోలీసులతో భారీ బందోబస్తు

గణేశ్ నిమజ్జనం సందర్భంగా 25న జీహెచ్ఎంసీ పరిధిలో సెలవు

ఏఐ టెక్నాలజీ, డ్రోన్లతో నిమజ్జన ప్రక్రియపై ప్రత్యేక నిఘా

నిమజ్జనం రోజు నగరంలోకి ప్రైవేట్ బస్సులు, లారీలకు అనుమతి నో

డీజేలు, అసభ్య నృత్యాలపై కఠిన చర్యలని సీపీ హెచ్చరిక

హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

(మిగతా 2వ పేజీలో..)



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# చెత్త నిర్వహణలో మార్పు..

# పరిశుభ్రతే ఆరోగ్యానికి పునాది

పట్టణాలు, గ్రామాలు వేగంగా విస్తరిస్తున్న కొద్దీ చెత్త సమస్య కూడా అంతే వేగంగా పెరుగుతోంది. జనాభా పెరుగుదల, వినియోగ సంస్కృతి, ప్లాస్టిక్ వినియోగం, ప్యాకేజింగ్ పదార్థాల పెరుగుదల కారణంగా ప్రతిరోజూ భారీగా వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. కానీ వాటిని సక్రమంగా సేకరించడం, వేరు చేయడం, శుద్ధి చేయడం, పునర్వినియోగం చేయడం వంటి ప్రక్రియలు చాలా ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ఫలితంగా రోడ్ల పక్కన చెత్త కుప్పలు, కాలువల్లో వ్యర్థాలు, ఖాళీ స్థలాల్లో చెత్త పారబోయడం సాధారణ దృశ్యాలుగా మారుతున్నాయి.పరిశుభ్రత అనేది కేవలం అందానికి సంబంధించిన విషయం కాదు. అది ప్రజారోగ్యంతో నేరుగా ముడిపడి ఉంటుంది. చెత్త సకాలంలో తొలగించకపోతే దోమలు, ఈగలు, ఇతర కీటకాలు పెరిగి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు కాలువల్లో పేరుకుపోతే వర్షాకాలంలో నీటి పారుదల సమస్యలు మరింత తీవ్రమవుతాయి. చెత్తను బహిరంగంగా కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతుంది. అంటే చెత్త నిర్వహణలో నిర్లక్ష్యం పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యానికీ ముప్పుగా మారుతుంది.

ఇంటి నుంచే మార్పు మొదలు కావాలి

చెత్త సమస్యను పూర్తిగా అధికార యంత్రాంగం బాధ్యతగా చూడటం సరైంది కాదు. ప్రతి ఇంటి నుంచే మార్పు ప్రారంభం కావాలి. తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర వ్యర్థాలను వేరు చేసి ఇవ్వడం వంటి చిన్న చర్యలే పెద్ద మార్పుకు దారితీస్తాయి. వంటింటి వ్యర్థాలను కంపోస్టింగ్ ద్వారా ఎరువుగా మార్చుకోవచ్చు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పునర్వినియోగించగల వస్తువులను ఉపయోగించడం ద్వారా చెత్త పరిమాణాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.ఇది ఒకరోజు చేయాల్సిన కార్యక్రమం కాదు. అలవాటుగా మారాల్సిన జీవన విధానం. ఇంట్లో చెత్తను వేరు చేసి బయటకు ఇచ్చే అలవాటు పెరిగితే మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలకు కూడా వ్యర్థాల నిర్వహణ సులభమవుతుంది.

సేకరణలోనే కాదు.. శుద్ధిలోనూ నాణ్యత అవసరం

చెత్తను సేకరించి ఒక చోట పడేయడం మాత్రమే వ్యర్థ నిర్వహణ కాదు. సేకరించిన తర్వాత దాని శాస్త్రీయ నిర్వహణ అత్యవసరం. తడి వ్యర్థాలతో కంపోస్ట్, పొడి వ్యర్థాల్లో పునర్వినియోగ పదార్థాలను వేరు చేయడం, మిగిలిన వాటిని శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలించడం వంటి చర్యలు చేపట్టాలి.ప్రతి పట్టణంలో రోజువారీ చెత్త ఉత్పత్తి ఎంత? దానికి అనుగుణంగా ప్రాసెసింగ్ సామర్థ్యం ఎంత? ప్రస్తుతం ఉన్న మౌలిక వసతులు ఎంతవరకు పనిచేస్తున్నాయి? అనే అంశాలపై స్థానిక సంస్థలు ఎప్పటికప్పుడు సమీక్ష చేయాలి. కేవలం వాహనాలతో చెత్త తరలించడం కాకుండా చివరి దశ వరకు పర్యవేక్షణ ఉండాలి.

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు అవసరం

ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి పెద్ద సవాలుగా మారుతున్నాయి. ఒక్కసారి ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత. దుకాణాలకు వెళ్లేటప్పుడు బట్ట సంచులు తీసుకెళ్లడం, నీటి సీసాలను పదేపదే వినియోగించడం, అధిక ప్యాకేజింగ్ ఉన్న వస్తువుల వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యలు చిన్నవిగా కనిపించినా ప్రభావం పెద్దదే.అదే సమయంలో ప్రత్యామ్నాయ ప్యాకేజింగ్ పదార్థాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత వ్యాపార సంస్థలపై కూడా ఉంది. వినియోగదారులకు ఎంపికలు ఉన్నప్పుడే మార్పు వేగంగా జరుగుతుంది.

పాఠశాలల నుంచే అవగాహన

పరిశుభ్రతపై అవగాహన చిన్ననాటి నుంచే పెంచాలి. పాఠశాలల్లో చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, నీటి సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను ఆచరణాత్మకంగా బోధించాలి. విద్యార్థులు నేర్చుకున్న అలవాట్లు కుటుంబాలకు కూడా చేరతాయి. పాఠశాల స్థాయిలో చిన్నచిన్న కార్యక్రమాల ద్వారా పెద్ద సామాజిక మార్పుకు పునాది వేయవచ్చు.

ప్రజల భాగస్వామ్యమే విజయానికి కీలకం

పరిశుభ్రమైన పరిసరాల కోసం ప్రభుత్వ సంస్థలు ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల సహకారం లేకుండా పూర్తి ఫలితం సాధ్యం కాదు. అదే సమయంలో ప్రజలకు బాధ్యతలు చెప్పే ముందు స్థానిక సంస్థలు కూడా తమ సేవలను సమర్థవంతంగా అందించాలి. చెత్త సేకరణ సమయాలు, ప్రత్యేక సేకరణ కేంద్రాలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ వంటి అంశాల్లో స్పష్టత ఉండాలి.రోడ్డుపై చెత్త వేయకూడదని చెప్పడం ఎంత ముఖ్యమో.. చెత్త వేయడానికి సరైన సదుపాయాలు కల్పించడం కూడా అంతే ముఖ్యం. జరిమానాల కంటే అవగాహన, సదుపాయాలు, నిరంతర పర్యవేక్షణ కలగలిసి పనిచేసినప్పుడే మంచి ఫలితం వస్తుంది. పరిశుభ్రత అనేది ఒక శాఖ పని కాదు.. సమాజం మొత్తం బాధ్యత. ఇంటి ముందు మాత్రమే కాదు, మన వీధి, మన కాలనీ, మన గ్రామం, మన పట్టణం పరిశుభ్రంగా ఉండాలని ప్రతి ఒక్కరూ ఆలోచించినప్పుడే నిజమైన మార్పు వస్తుంది. చెత్తను సమస్యగా చూసే దశ నుంచి.. వ్యర్థాన్ని వనరుగా మార్చే దిశగా అడుగులు వేయాల్సిన సమయం వచ్చింది. పరిశుభ్రమైన సమాజమే ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బలమైన పునాది.

## గణేశ్ నిమజ్జనం: 25న సెలవు, వేలాదిమంది పోలీసులతో భారీ బందోబస్తు

మొదటి పేజీ తరువాయి)

తీసుకుంది. ఈ నెల 25వ తేదీన (శుక్రవారం) జీహెచ్ఎంసీ పరిధిలో సాధారణ సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు, నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో ముగించేందుకు పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. మొత్తం 28,400 మంది సిబ్బందిని భద్రతా విధులకు కేటాయించారు.ఈ నెల 25న నిమజ్జనం ఉండటంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు వెలువరించింది. ఈ సెలవుకు బదులుగా నవంబర్ 14వ తేదీన (రెండో శనివారం) పనిదినంగా పరిగణించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లపై సజ్జనార్

నిమజ్జన ఏర్పాట్లపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. నగర పరిధిలో 20,000 మంది, ఇతర జిల్లాల్లో 8,400 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది నిఘా కోసం అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తున్నామని, 24 డ్రోన్లు, 10,000 సీసీటీవీ కెమెరాల ద్వారా నిమజ్జన ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. హుస్సేన్ సాగర్ పరిసరాల్లో 100 హై-రైజ్ కెమెరాలు ఏర్పాటు చేశామని, చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాల కట్టడికి 25 క్రైమ్ బ్రాంచ్ బృందాలను రంగంలోకి దించినట్లు వివరించారు. మహిళల భద్రత కోసం 'షీ టీమ్స్' నిఘాను ముమ్మరం చేశామని, ఊరేగింపుల్లో డీజేలు వినియోగం, మండపాల వద్ద అసభ్యకర పాటలు, నృత్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో పాత వీడియోలు లేదా తప్పుడు ప్రచారాలను వ్యాప్తి చేయవద్దని ప్రజలకు సూచించారు. ఖైరతాబాద్ గణనాథుని దర్శన గడువు నేటి (బుధవారం) అర్ధరాత్రితో ముగియనుంది. నిమజ్జనం రోజున నగరంలోకి ప్రైవేట్ బస్సులు, భారీ ట్రక్కుల ప్రవేశానికి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు.

# డీఏల పెండింగ్‌కు తెర.. రెండు విడతల్లో చెల్లింపులు

మొదటి పేజీ తరువాయి)

అక్టోబర్ జీతంతో తొలి డీఏ

ప్రభుత్వం ఆమోదించిన రెండు డీఏల్లో మొదటి డీఏను అక్టోబర్ నెల జీతంతో కలిపి చెల్లించేందుకు నిర్ణయించినట్లు సమావేశంలో స్పష్టత వచ్చింది. దీంతో చాలాకాలంగా డీఏ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థికంగా కొంత ప్రయోజనం లభించనుంది.అక్టోబర్ జీతంతోనే తొలి డీఏ అందుబాటులోకి రానుండటంతో ఉద్యోగ వర్గాల్లో సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. అయితే డీఏ శాతం, బకాయిల చెల్లింపు విధానం, అమలుకు సంబంధించిన పూర్తి ఉత్తర్వులు వెలువడిన తర్వాతే ఉద్యోగులకు లభించే ఖచ్చితమైన ఆర్థిక ప్రయోజనంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఉగాది సందర్భంగా రెండో డీఏ

రెండో డీఏను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. అంటే ఉద్యోగులకు రెండు విడతల్లో డీఏ ప్రయోజనం అందనుంది. ఒక డీఏను అక్టోబర్ జీతంతో చెల్లించగా.. మరో డీఏను ఉగాది సమయంలో విడుదల చేయడం ద్వారా పెండింగ్‌లో ఉన్న డీఏలను దశలవారీగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. చాలాకాలంగా డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగ సంఘాలు ఈ అంశాన్ని ప్రధాన డిమాండ్‌గా ముందుకు తీసుకెళ్లాయి. తాజా సమావేశంలో ప్రభుత్వం రెండు డీఏలకు అంగీకరించడంతో ఈ అంశంపై కొంతకాలంగా కొనసాగుతున్న అనిశ్చితికి తెరపడినట్లయింది.

పీఆర్సీపై మాత్రం స్పష్టత కరువు

మరోవైపు ఉద్యోగులు ప్రధానంగా కోరుతున్న పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) అంశంపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టమైన నిర్ణయం ప్రకటించలేదు. డీఏలతో పాటు పీఆర్సీని కూడా అమలు చేయాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించిన పీఆర్సీపై ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుందనే అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.డీఏల విడుదలకు ప్రభుత్వం అంగీకరించినప్పటికీ.. పీఆర్సీపై నిర్ణయం వాయిదా పడటంతో ఉద్యోగ సంఘాల తదుపరి కార్యాచరణపై ఆసక్తి నెలకొంది. పీఆర్సీపై ప్రభుత్వం త్వరలోనే స్పష్టత ఇస్తుందా? ఉద్యోగ సంఘాలతో మరోసారి చర్చలు నిర్వహిస్తుందా? అనే అంశాలపై ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఉద్యోగ సంఘాల డిమాండ్లపై చర్చ

సీఎస్‌తో జరిగిన సమావేశంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. డీఏలు, పీఆర్సీతో పాటు ఉద్యోగులకు సంబంధించిన ఇతర సమస్యలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయాన్ని ఉద్యోగ సంఘాలు ఎలా స్వీకరిస్తాయన్నది కూడా ప్రాధాన్యం సంతరించుకుంది.డీఏల విషయంలో నిర్ణయం వెలువడటంతో ఉద్యోగులపై కొంతకాలంగా ఉన్న ఆర్థిక ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది. అయితే పూర్తి ప్రయోజనం ఎప్పుడు, ఏ విధంగా అందుతుంది అన్నది ప్రభుత్వం జారీ చేసే అధికారిక ఉత్తర్వుల ద్వారా మరింత స్పష్టమవుతుంది. రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఉద్యోగుల్లో కొంత ఊరట కనిపిస్తున్నప్పటికీ.. పీఆర్సీపై నిర్ణయం కోసం వారి ఎదురుచూపులు మాత్రం కొనసాగనున్నాయి

## బెంగాల్‌లో మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించండి.. సీఈసీపై విమర్శల నేపథ్యంలో మమత డిమాండ్

మొదటి పేజీ తరువాయి)

చేశారన్న వార్తలు దీనికి ఆజ్యం పోశాయి. ఈ నేపథ్యంలో మాజీ సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. పాత ఓటర్ల జాబితాతో బెంగాల్‌లో మరోసారి అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను అరెస్ట్ చేయాలని కోరారు. జ్ఞానేశ్ కుమార్ సీఈసీగా ఉన్నంతకాలం దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ప్రకటించారు. ఈ అంశంపై ఇండియా కూటమి భాగస్వామ్యాలతో చర్చించామన్నారు. త్వరలో సమావేశం అవుతామని తెలిపారు. టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీకి ప్రయోజనం చేకూర్చేందుకు బెంగాల్ ఓటర్ల జాబితా నుంచి 30 లక్షల పేర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారని ఆరోపించారు. హర్యానా, బీహార్‌లోనూ ఇలాంటి చర్యలు జరిగాయని అన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ఎన్నికల సంఘం వ్యవహారాలపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.అయితే ఎన్నికల సంఘం ఈ ఆరోపణలను ఖండించింది. 'సర్' సహా అన్ని కీలక నిర్ణయాలు ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఏకగ్రీవ ఆమోదంతోనే తీసుకున్నామని స్పష్టం చేసింది. అధికారులు చర్చల సమయంలో వివిధ అభిప్రాయాలు, సూచనలు ఇవ్వడం సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగమేనని తెలిపింది. ఓటర్ల హక్కులను కాపాడేందుకే ఈ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొంది.

## సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే...!: ఎన్నికల కమిషన్‌పై ప్రియాంక గాంధీ తీవ్ర వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి)

కమిషన్‌తో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని తెలిసి కూడా సీఈసీ వాటిని అనుమతించి ఉంటే, అటువంటి చర్య దేశద్రోహం కిందకే వస్తుందని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం తన వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నీలంబూరులో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు.ఎన్నికల కమిషన్ (ఈసీ) పనితీరులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయని వెలువడిన మీడియా కథనాలపై ఆమె స్పందించారు. ఈ పరిణామాలు ప్రజాస్వామ్యానికి "అత్యంత ప్రమాదకరం" అని ఆమె అభివర్ణించారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సందర్భంగా పేర్ల తొలగింపు సహా పలు ఇతర అంశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అసమ్మతి వ్యక్తం చేశారన్న కథనాలను ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో లక్షలాది మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి అక్రమంగా తొలగించారని గత కొంతకాలంగా వస్తున్న ఆరోపణలను ఆమె గుర్తుచేశారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగకపోతే లేదా ఈసీయే అక్రమాలకు సహకరిస్తే, అది ప్రజాస్వామ్యంపై జరిగిన గొడ్డలిపెట్టుగా పరిగణించాల్సి ఉంటుందని అన్నారు. అయితే, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల కమిషన్ ఇదివరకే స్పష్టం చేయడం గమనార్హం.

## రైతుల పోరాటంతోనే ప్రభుత్వం దిగొచ్చింది: జూరాల నీటి విడుదలపై కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

అనే ప్రసిద్ధ నినాదాన్ని గుర్తుచేస్తూ... తమ హక్కుల సాధన కోసం రోడ్డెక్కిన పాలమూరు అన్నదాతల పోరాట పటిమ గొప్పదని కొనియాడుతూ సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు. కాలువలకు నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్న విపత్కర పరిస్థితుల్లో రైతులు చేసిన సమరశీల పోరాటం అత్యంత స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈ ప్రభుత్వాన్ని రైతులు ముల్లుగర్రతో తట్టి నిద్రలేపి, నీటిని విడుదల చేసేలా పరుగులు పెట్టించారని కేటీఆర్ ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిర్బంధాలను సైతం ఎదుర్కొని రైతులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించడం, తెలంగాణ ప్రజల కనీస అవసరాలను తీర్చేలా ఈ ప్రభుత్వాన్ని పరుగులు పెట్టించడమే రాబోయే కాలంలో బీఆర్ఎస్ ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం ఎట్టకేలకు దిగొచ్చి నీటిని విడుదల చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత

ఘటనలో ఐదుగురు పసికందులు మరణించడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని సురక్ష చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి తల్లిదండ్రులను నేడు ఆమె పరామర్శించి ఓదార్చారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదుగురు గిరిజన, మైనార్టీ పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతే కనీసం వచ్చి పరామర్శించే సమయం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. వైఫల్యాలను ఎండగడుతూ, సీఎంకు నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవధిలోగా ప్రభుత్వ ఆసుపత్రుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, గిరిజన గూడేలకు రహదారి సదుపాయాలు కల్పించాలని, కేంద్ర నిధుల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులకు నిధులు కేటాయించకపోతే ఆదివాసీలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 'ఘెరావ్' చేపడతామని హెచ్చరించారు. రిమ్స్‌లో 150 ఏసీలు ఉన్నా ఒక్క మెకానిక్ కూడా లేకపోవడం, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రూ.500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వైద్యారోగ్య రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.

## తెలంగాణకు కర్ణాటక సీఎం గుడ్ న్యూస్... జూరాలకు నీటి విడుదలకు ఓకే

తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విడతల వారీగా 3 టీఎంసీల నీటిని ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులకు భారీ ఊరట లభించినట్లయింది.ఈ మేరకు బుధవారం తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి నేతృత్వంలోని ప్రజాప్రతినిధుల బృందం బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైంది. జూరాల ప్రాజెక్టు కింద నీటి అవసరాలను, వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను వారు ఆయనకు వివరించారు. తెలంగాణ మంత్రుల విజ్ఞప్తిని పరిశీలించిన డీకే శివకుమార్, అధికారులతో చర్చించిన అనంతరం జూరాలకు నీటిని విడుదల చేసేందుకు అంగీకరించారు. దీంతో జూరాల ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలకు జీవం పోసినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కర్ణాటక సానుకూలంగా స్పందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## భారీ వర్షానికి దెబ్బతిన్న చార్మినార్.. ఊడిపడిన ప్లాస్టరింగ్

శనివారం వరకు భారీ వర్ష సూచనతో అప్రమత్తమైన అధికారులు

భాగ్యనగరంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో చారిత్రక కట్టడం చార్మినార్ స్వల్పంగా దెబ్బతింది. మంగళవారం రాత్రి పాతబస్తీలో సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వానకు లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది.సమాచారం అందుకున్న చార్మినార్ భద్రతా సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, కిందపడిన ప్లాస్టరింగ్ శకలాలను తొలగించారు. మంగళవారం సాయంత్రం నగరంలో 37.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భారీ వర్షం కారణంగానే మినార్ ప్లాస్టరింగ్ ఊడిపడి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.ఈ ఘటనపై భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులు స్పందించారు. ఎడమవైపు మినార్ కింద ఉన్న గోడ వెలుపలి భాగం కొంత బలహీనపడటంతో భారీ వర్షానికి ప్లాస్టరింగ్ రాలిపోయిందని వారు తెలిపారు. దెబ్బతిన్న భాగానికి మరమ్మతులు నిర్వహించేందుకు ఇప్పటికే టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల్లో అత్యధికంగా సంగారెడ్డిలో 82.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మరోవైపు, ఈ నెల 26వ తేదీ శనివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో చార్మినార్‌తో పాటు ఇతర చారిత్రక కట్టడాల వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులు నిర్ణయించారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
సెప్టెంబర్ । గురువారం । 24 । 2026


# రస బసగా కొనసాగిన గ్రామసభ





## రుద్రూర్ గ్రామ సభలో గందరగోళం

**రుద్రూర్: సెప్టెంబర్23( జన సంఘర్షణ)**

నిజామాబాద్ జిల్లా రుద్రూరు మండల కేంద్రం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట డబుల్ బెడ్ రూమ్ పంపిణీలో భాగంగా ఏర్పాటుచేసిన గ్రామసభ రసవసగా కొనసాగింది, గ్రామసభల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఆగిపోవడంతో, ఇల్లు లేని నిరుపేదలకు నిరాశే మిగిలిందని పలువురు చర్చలు చేసుకున్నారు. గ్రామసభ ఉదయం ప్రారంభం కాగానే గ్రామస్తులు ఇల్లు లేని నిరుపేదలు భారీ సంఖ్యలో తరలి రావడం జరిగింది, ఈ సందర్భంగా అధికారుల సమక్షంలో కొనసాగిన గ్రామసభ అధికారులు ఎంక్వయిరీ చేసి 169 మంది లబ్ధిదారుల పేర్లు ఖరారు చేసి గ్రామసభలో వినిపించే పరిస్థితి ఉండగా, కొంతమంది గ్రామస్తులు, ఎవరి అభిప్రాయాలు వారు తెలియజేయడమే కాకుండా, లబ్ధిదారుల ఎంపిక విషయంలో కుల సంఘాలకు ఏ విధంగా ఇస్తారు అని ప్రశ్నలు వర్షం కురిపించారు. అలాంటప్పుడు కుల సంఘాలకు ఎలా ఇస్తారని కొంతమంది తమ అభిప్రాయాలను తెలియజేశారు, కుల సంఘాల వారికి ఇస్తే సరైన న్యాయం జరగదు అని, అది కరెక్ట్ కాదని కొంతమంది తమ అభిప్రాయాలు తెలియజేశారు. మరికొంతమంది డ్రా సిస్టం ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరగాలని తమ అభిప్రాయాలు వెలిబుచ్చగా మరికొంతమంది ఇది కరెక్ట్ కాదని తమ అభిప్రాయాలు తెలియజేశారు. రుద్రూర్ మండల కేంద్రంలో నిర్మాణం చేపట్టిన 150 రెండు పడక గదులను లబ్ధిదారుల ఎంపికపై గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన గ్రామసభ రస బస పరిస్థితికి దారితీసింది. 150 రెండు పడక గదులు అసంపూర్తిగా ఉండగా వీటికి 483 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ విషయంపై కుల సంఘాలతో తాసిల్దార్ తారాబాయి, గ్రామ సర్పంచ్ సునీత వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కొంతమంది ఈ రెండు పడక గదుల్లో సిమెంట్ రోడ్లు, మురికి కాలువలు, గదులకు తలుపులు, కిటికీలు, మంచినీటి సౌకర్యం, విద్యుత్తు లేక ముళ్ళ పొదల్లో మురుగుతున్నాయని. వీటిని బాగు చేసుకోవడానికి లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు లక్షల వరకు ఖర్చు అవుతుందని ముందే పేదవాళ్లు ఈ గదులను బాగు చేసుకోవడానికి ఎక్కడి నుంచి డబ్బులు తెస్తారు అంటూ కొందరు అధికారులను ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన విధంగా రెండు పడక గదుల్లో మౌలిక వసతులు కల్పించి అర్హులైన లబ్ధిదారులకు అందజేయాలంటూ కొంతమంది తాసిల్దార్ దృష్టికి తెచ్చారు. మరికొంతమంది కి రెండు పడక గదులు అందకుండా పోతున్నాయని వారు గ్రామసభలో గందరగోళం సృష్టించారు. చాలా సేపు గ్రామ సభలో అధికారులను గ్రామస్తులు నిలదీశారు. ఈ సందర్భంగా తహసిల్దార్, ఉపతాహసిల్దార్లు, ప్రభుత్వం సర్వే చేసి ఎంపిక చేసిన 169 మంది పేర్లను చదివి వినిపిస్తామని, సిద్ధంగా ఉన్న తరుణంలో కొంతమంది, అర్హులకు రావాలని అనుహరులకు వస్తే సహించేది లేదని, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి అంటూ, గందరగోళం చేయగా, అధికారులు ఎంపిక చేసిన 169 మంది పేర్లను డిక్లేర్ చేయడం ఆపివేసినారు,ఈ సందర్భంగా మాజీ సొసైటీ చైర్మన్ పత్తి రాము, మాజీ జెడ్పిటిసి నారోజి గంగారం, మాజీ సర్పంచ్ ఇందూరి చంద్రశేఖర్, వార్డు సభ్యులు హరి, తో పాటు చాలామంది ప్రజలకు సముదాయించే యత్నం చేశారు. చివరికి లబ్ధిదారుల ఎంపిక గ్రామంలో ఉన్న సుమారు 36 కుల సంఘాలకు అప్పజెప్పడం జరుగుతుందని కుల సంఘాల వారే న్యాయ నిర్ణీతలు అని వారు చెప్పిన పేర్లు అధికారులకు తెలియజేసి అధికారుల ద్వారా, గ్రామసభ నిర్వహించి డిక్లేర్ చేయడం జరుగుతుందని అనడంతో ప్రజలంతా శాంతించి వెళ్ళిపోయారు ఈ సందర్భంగా గ్రామ సభ శాంతియుతంగా ముగిసింది.రుద్రూరు గ్రామపంచాయతీ ఎదుట జరిగిన గ్రామసభలో అర్హులైన లబ్ధిదారులు తమకు న్యాయం జరుగుతుంది అని డబుల్ బెడ్ రూమ్ కళా నెరవేరుతుంది అంటూ ఎంతో ఆశతో వచ్చిన ప్రజలకు మళ్లీ గ్రామసభలో ఎంపిక ప్రక్రియ వాయిదా పడడంతో నిరాశ నిస్పృలకు గురయ్యారు అనేది చర్చ జరిగింది.సుమారు పది సంవత్సరాల నుంచి డబుల్ బెడ్ రూమ్ పంపిణీ కల కలగానే ఉంటుందిడబుల్ బెడ్ రూమ్ కల నిరుపేదలకు తీరేదిన్నడోగత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్ల నిర్మాణం బాన్సువాడ నియోజకవర్గం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా జరిగినాయి. మండల కేంద్రంలో కొన్ని డబుల్ బెడ్ రూములు ఇళ్ల పంపిణీ జరిగినాయి, సుమారు 150 ఇండ్ల పంపిణీ అలాగే ఉంది, దీంట్లో సుమారు 30 నుంచి ఆపై ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ప్రభుత్వం మారిపోవడంతో ఇళ్ల నిర్మాణ పనులు ఆగిపోవడం జరిగింది. గతంలో ఇండ్ల పంపిణీలో భాగంగా డబ్బులు చేసిన సందర్భం ఉందని అలాగే ఇప్పుడు కూడా డబ్బులు వసూలు చేస్తున్నారనే విషయాలు తెలుస్తుందని గత రెండు రోజుల క్రితం గ్రామ సర్పంచ్, ప్రెస్ మీట్ లో వెల్లడి చేసిన సందర్భం ఉంది.

రెండు వర్గాల ఆధిపత్య పోరులో నిరుపేదలకు న్యాయం జరుగుతుందా

మండల కేంద్రంలో ఇండ్ల పంపిణీలో భాగంగా గ్రామపంచాయతీ ఎదుట ఏర్పాటు చేసిన గ్రామసభలో ఇరువర్గాల ఆధిపత్య పోరు స్పష్టంగా కనిపిస్తుందని కొంతమంది విమర్శలు తెలియజేస్తున్నారు. రెండు వర్గాల ఆధిపత్య పోరులో నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందా అనే ప్రశ్నల వర్షం భారీగానే వినిపిస్తుంది. సుమారు పది సంవత్సరాలు నుంచి ఇరువర్గాల ఆధిపత్య పోరులో ఎంతోమంది బలై అర్హులైన నిరుపేదలకు న్యాయం జరగలేకపోతుందని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ కలగానే మిగిలిపోతుందని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఏది ఏమైనా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి నిరుపేదలకు న్యాయం చేయడంలో భాగంగా ఎంతో కృషి చేస్తున్నప్పటికీ, ప్రజలకు సొంతింటి కల నెరవేర్చాలని దుడ సంకల్పంతో ఉన్నప్పటికీ, వారి యొక్క సంకల్పం బలంగా ఉన్నప్పటికీ, ఇరు వర్గాల పోరు, ఆయన సంకల్పానికి అడ్డంకిగా మారడమే కాకుండా అర్హులైన నిరుపేదలకు శాపంగా మారుతుందని ప్రజలు విమర్శలు చేస్తున్నారు.

నిరుపేదలంతా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వెనుక

నిరుపేదలకు పూర్తి విశ్వాసం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పై

డబుల్ బెడ్ రూమ్ పంపిణీలో ఎన్ని కుట్రలు జరిగినా నిరుపేద ప్రజలు మాత్రం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పై పూర్తి విశ్వాసం ఉంచుకున్నారు ,ఆయన తప్పనిసరిగా న్యాయం చేస్తారు అనే భరోసా నిరుపేద ప్రజలు ఉంచుకున్నారు అనే చర్చలు జరుగుతున్నాయి.అందుకే కాబోలు బాన్సువాడ నియోజకవర్గం లో ప్రతిసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనం ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో వరుసగా గెలిపించడం దీనికి ఉదాహరణ కాదా అని పలువురు చర్చలు చేసుకుంటున్నారు.

కుల సంఘాలకే న్యాయ నిర్ణేత బాధ్యతలు

గ్రామస్తుల తీర్పు మేరకు కుల సంఘాల కే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అప్పు చేయడం జరిగిందని అధికారులు చెప్పుకో వస్తున్నారు.169 మంది లబ్ధిదారుల ఎంపిక చేయడం జరిగిందని అందులో భాగంగా గ్రామసభలో 169 మంది లబ్ధిదారుల పేర్లను చదవడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, కుల సంఘాల కే న్యాయమేతుగా చేయాలని గ్రామస్తులు తమకు చెప్పడంతో వారి నిర్ణయం మేరకు కుల సంఘాల వారికే న్యాయమేతలుగా చేయడం జరిగిందని అధికారులు చెప్పుకొస్తున్నారు. మొత్తం 483 మంది అప్లికేషన్లు రాగా కొన్ని కుల సంఘాల వారు అప్లికేషన్లు ఇవ్వకపోవడంతో మళ్లీ కొన్ని అప్లికేషన్లు వచ్చినాయని సుమారు 550 వరకు అప్లికేషన్లు రావడం జరిగిందని అధికారులు చెబుతున్నారు. కుల సంఘాల వారే లబ్ధిదారుల ఎంపిక చేసి తమ దృష్టికి తీసుకువస్తే గ్రామ సభ ద్వారా ప్రజల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని అధికారులు చెప్పుకోరవడం జరుగుతుంది.

# వరి ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలి.






**డిజిటల్ క్రాప్ సర్వే,ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలు వెంటనే పూర్తి చేయాలి.**

**రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (జన సంఘర్షణ)**

వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని జిల్లాల్లో అధికారులు తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు.బుధవారం వ్యవసాయ శాఖ కార్యదర్శి, అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, అధికారులతో హైదరాబాదు నుంచి వరి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు, డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ (ఫార్మర్ ఐడీ నమోదు) ప్రక్రియలపై ఇతర ఉన్నతాధికారులతో కలిసి విడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో వరి ధాన్యం కొనుగోలుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.అన్ని కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు.తగినన్ని లారీలు,టార్పాలిన్ లు,గన్నీ సంచులు,హమాలీలు,సామాగ్రి సమకూర్చుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు.ప్రభుత్వం నిర్ణయించిన ఏడు రకాల సన్న వరి వడ్లు పండించిన రైతులకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ అందిస్తామన్నారు.రికార్డుల ప్రకారం 10 లక్షల 50 వేలకు పైగా రైతులు దాదాపు 34 లక్షల 84 వేల ఎకరాల్లో సన్న వరి రకాలు సాగు చేశారని అన్నారు.డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ ద్వారా రైతులకు వ్యవసాయ సంబంధిత అనేక అంశాల్లో ఉపయోగాలు ఉంటాయన్నారు.డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహణలో గ్రామీణ స్థాయిలో స్థానికంగా వ్యవసాయ అంశాలపై అవగాహన ఉన్న వారిని వాలంటీర్లుగా నియమించుకోవాలని పేర్కొన్నారు.ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వేల వివరాలను జిల్లాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు.జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్ కుమార్, సివిల్ సప్లై అధికారి నిత్యానంద లు పాల్గొన్నారు. వీసీ అనంతరం అధికారులతో డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లాలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ,డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ వివరాలను సమీక్షించారు.మిగిలిన రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే ను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు.ఈ వీసీలో డి ఆర్ డి వో శ్రీనివాస్ రావు, కో ఆపరేటివ్ శాఖ అధికారి పద్మ,ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అంబం గ్రామంలో సిద్ధి వినాయక శోభాయాత్ర

**రుద్రూర్: సెప్టెంబర్23( జన సంఘర్షణ)**



నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రం గ్రామం అంబం (ఆర్ )గ్రామంలో శ్రీ సర్వజానిక్ గణేష్ గ్రామ అభివృద్ధి ఆధ్వర్యంలో శోభయాత్ర ఘనంగా నిర్వహించడం జరిగింది గ్రామ కమిటీ అధ్యక్షులు బడే రాము ఉపాధ్యక్షులు బట్టు వీరయ్య క్యాషియర్ సగిరెల్లి పండరి గ్రామ సర్పంచ్ కుర్లెపు గంగాధర్ ఉపసర్పంచ్ రేపల్లి సాయి ప్రసాద్ గ్రామ పెద్దలు పట్టేపు రాములు ఆర్ సాయిలు అసం రాము తదితరులు పాల్గొనడం జరిగింది.

## తిర్మలాపూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- **కొత్త రేషన్ కార్డులు అందుకోవడంతో లబ్ధిదారుల్లో ఆనందం.. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందన్న ఉప సర్పంచ్ సంజీవ్**



**పోతంగల్, సెప్టెంబర్ 23 (జనసంఘర్షణ):**



నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం తిర్మలాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కొత్త రేషన్ కార్డులు అందుకోవడంతో గ్రామంలోని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఊా శ్రీనివాస్, సర్పంచ్ బోయి సైదవ్వ, ఉప సర్పంచ్ సంజీవ్, వార్డు సభ్యులు అస్మా బేగం, రమాబాయి, కాశి తదితరులు పాల్గొన్నారు. లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ సంజీవ్ మాట్లాడుతూ.. కొత్త రేషన్ కార్డుల పంపిణీతో ప్రజల్లో ఆనందం నెలకొందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ తమపై నమ్మకం కలిగిస్తోందని పేర్కొన్నారు.గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డుల మంజూరుకు సంబంధించి తమ గ్రామ ప్రజలు ఎదురుచూశారని, ఇప్పుడు స్మార్ట్ రేషన్ కార్డులు అందడంతో లబ్ధిదారులకు ప్రయోజనం కలుగుతోందని ఉప సర్పంచ్ సంజీవ్ తెలిపారు."ప్రజలకు అవసరమైన రేషన్ కార్డులు అందడం సంతోషకరమైన విషయం. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు కొనసాగాలి" అని ఆయన అన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, లబ్ధిదారులు పాల్గొని కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు అందుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు.

## వర్ణి మండలంలో MRPS నూతన కమిటీ ఎన్నిక

**మండల అధ్యక్షుడిగా సంగోల్లా అశోక్.. కొత్త కమిటీని ప్రకటించిన నాయకత్వం**

**వర్ణి, సెప్టెంబర్ 23 (జనసంఘర్షణ):**




వర్ణి మండల కేంద్రంలో వీఘాా నూతన మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి సోంపూర్ పోచిరాం ఆధ్వర్యంలో, జిల్లా ఇన్‌చార్జి మాసాయిపేట యాదగిరి ఆదేశాల మేరకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ వివరాలు మండల అధ్యక్షుడు: సంగోల్లా అశోక్ ఉపాధ్యక్షులు: సమేనా కాశీరామ్ ప్రధాన కార్యదర్శి: నెమ్లి ప్రభాకర్ కార్యదర్శులు: చిట్టోళ్ల శ్రీనివాస్, ఫట్లా సాయిలు కోశాధికారి: ఈబత్వార్ మారుతీ ప్రచార కార్యదర్శి: సిందిగిడి రవి సలహాదారులు: కొరోల్లా సాయిలు, మెరుగు కాశీరామ్, శివుని సాయిలు. కార్యవర్గ సభ్యులు: ఎభత్వార్ రాజు, గంగాధర్, దశరథుడు, సంగోల్లా గంగారం, అవనూరి రాజు, అవనూరి రామ్‌చందర్. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు. మండలంలో వీఘాా కార్యకలాపాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని నాయకులు ఆకాంక్షించారు.


# సబ్సిడీ ఎల్ పీజీ రీఫిల్‌కు ఆధార్ ఈ కేవైసీ తప్పనిసరి.

**అక్టోబర్ నెలలోపు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి.**

**జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నిత్యానంద గౌడ్ లబ్ధిదారులకు సూచించారు.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (జన సంఘర్షణ)**

గృహ వినియోగ ఎల్పిజి సిలిండర్లను సబ్సిడీతో పొందుతున్నవినియోగదారులు అక్టోబర్ 1, 2026లోపు ఆధార్ ఆధారిత ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నిత్యానంద గౌడ్ ప్రకటనలో తెలిపారు.ఇప్పటికే ఈ కేవైసీ పూర్తి చేసుకున్న వినియోగదారులు మళ్లీ ఈ కేవైసీ చేసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు.ఈ కేవైసి పూర్తి చేయని వినియోగదారులుఎల్ పీజీ సిలిండర్ డెలివరీ సమయంలో డెలివరీ బాయ్ ఇంటి వద్దకు వచ్చినప్పుడు, సంబంధిత ఎల్ పీజీ ఏజెన్సీ,డిస్ట్రిబ్యూటర్ వద్దకు వెళ్లి, లేదా సంబంధిత ఆయిల్ కంపెనీ మొబైల్ యాప్ ద్వారా ఇంటి నుంచే ఈ కేవైసీ పూర్తి చేసుకోవచ్చన్నారు ఇండియన్ వినియోగదారులు ఇండియాన్ ఆయిల్ భారత్ గ్యాస్ వినియోగదారులు హలో బిపిసిఎల్ వినియోగదారులు పే మొబైల్ యాప్‌ల ద్వారా ఈ కేవైసీ పూర్తి చేసుకునే అవకాశం ఉందనీ, ఈ కేవైసీ ప్రక్రియ ద్వారా సబ్సిడీ ప్రయోజనం అర్హత కలిగిన నిజమైన వినియోగదారులకు మాత్రమే అందేలా చూడడంతో పాటు, డూప్లికేట్ అనర్హమైన ఎల్ పీజీ కనెక్షన్లను నివారించడానికి వీలు కలుగుతుందని తెలిపారు.కావున ఈ కేవైసీ పూర్తి చేయని ఎల్ పీజీ వినియోగదారులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పై మూడు మార్గాలలో ఏదైనా ఒకదాని ద్వారా అక్టోబర్ 01లోపు ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని చెప్పారు.ఎల్పీజీ సేవలకు సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్: 1800 2333 55 ను సంప్రదించలన్నారు.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక

# గిరిజన ఏజెన్సీ యువతకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలి

**సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, గిరిజన ప్రజాప్రతినిధులు, మంత్రులు**

**ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక కోటా అమలు చేయాలని వినతి**

**జన సంఘర్షణఅశ్వారావుపేట నియోజకవర్గం, సెప్టెంబర్ 18:**

గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లోని యువతకు ఉద్యోగ నియామకాల్లో 75 శాతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆధ్వర్యంలో పలువురు గిరిజన ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కలిశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్తో కలిసి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే కొమరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఇతర గిరిజన ప్రజాప్రతినిధులు ఏజెన్సీ ప్రాంతాల యువతకు ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయాల్సిన అవసరాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

ఏజెన్సీ యువతకు ఉద్యోగాల్లో ప్రత్యేక ప్రాధాన్యత

ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా 2026 పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో ఏజెన్సీ ప్రాంతాలకు సంబంధించిన పోస్టుల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు.మారుమూల గిరిజన గ్రామాల్లోని యువతకు విద్య, శిక్షణ, రవాణా తదితర సదుపాయాలు పరిమితంగా ఉండటంతో సాధారణ పోటీ ప్రక్రియలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజాప్రతినిధులు వివరించారు. ఏజెన్సీ ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని స్థానిక యువతకు ప్రత్యేక అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

అశ్వారావుపేట నియోజకవర్గ యువత తరపున ఎమ్మెల్యే విజ్ఞప్తి అశ్వారావుపేట నియోజకవర్గంలో గిరిజన ఏజెన్సీ ప్రాంతాలు విస్తారంగా ఉన్నాయని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లోని అనేక గ్రామాలకు చెందిన గిరిజన యువత ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్నారని వివరించారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి సిద్ధమవుతున్న యువతకు 75 శాతం ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు లభిస్తాయని, తద్వారా గిరిజన కుటుంబాల ఆర్థిక పరిస్థితుల్లో కూడా మార్పు వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

గత ప్రత్యేక నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలి

ఏజెన్సీ ప్రాంతాలకు గతంలో అమలైన ప్రత్యేక రిజర్వేషన్ నిబంధనలు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, గెజిట్ నోటిఫికేషన్లను పరిశీలించి ప్రస్తుత పోలీస్ నియామక ప్రక్రియలో కూడా 75 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని గిరిజన ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారు.చట్టపరమైన, పరిపాలనా అంశాలను పరిశీలించి ఏజెన్సీ ప్రాంతాల స్థానిక గిరిజన యువతకు ప్రయోజనం కలిగే విధంగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రులు, గిరిజన ప్రజాప్రతినిధుల దృష్టి

ఈ అంశాన్ని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గిరిజన యువతకు ఉద్యోగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రి దనసరి అనసూయ సీతక్క, మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి



పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ తదితరులు ఉన్నారు.అయితే వీరందరూ ఈ ప్రత్యేక భేటీలో పాల్గొన్నారని కాకుండా, రాష్ట్ర మంత్రివర్గ సభ్యులుగా మాత్రమే ఈ సందర్భంలో ప్రస్తావించబడుతున్నారు.

పోలీస్ ఉద్యోగాల భర్తీ నేపథ్యంలో కీలక డిమాండ్

రాష్ట్రంలో పోలీస్ శాఖలో ఖాళీల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఏజెన్సీ యువతకు 75 శాతం రిజర్వేషన్ డిమాండ్ ప్రాధాన్యత సంతరించుకుంది. పోలీస్ ఉద్యోగాల కోసం గిరిజన ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువత సిద్ధమవుతున్న నేపథ్యంలో, నియామకాల్లో తమకు ప్రత్యేక కోటా కల్పించాలని వారు కోరుతున్నారు.స్థానిక గిరిజన యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు. పోలీస్ శాఖలో స్థానిక యువతకు అవకాశాలు లభిస్తే గిరిజన ప్రాంతాల్లోనే ఉద్యోగ అవకాశాలు పెరగడంతో పాటు యువతలో ప్రభుత్వ ఉద్యోగాలపై మరింత ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలి ఏజెన్సీ ప్రాంతాల్లోని యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కోరారు. ఉద్యోగ అవకాశాల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గించి, స్థానికంగానే ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక విధానాలు అవసరమని తెలిపారు. ప్రస్తుత పోలీస్ నియామక ప్రక్రియలోనే ఏజెన్సీ ప్రాంతాల యువతకు 75 శాతం రిజర్వేషన్ అమలు చేసే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రిని కోరారు.


సీఎం నిర్ణయంపై గిరిజన యువతలో ఆసక్తి

75 శాతం రిజర్వేషన్ డిమాండ్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఏజెన్సీ ప్రాంతాల గిరిజన యువతలో ఆసక్తి నెలకొంది. ప్రభుత్వం సంబంధిత నిబంధనలు, చట్టపరమైన అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని యువత కోరుతోంది.పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో 75 శాతం ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయాలన్న డిమాండ్‌పై ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం ఏజెన్సీ ప్రాంతాల నిరుద్యోగ యువత ఎదురుచూస్తోంది.గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశామని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు.

## పోతంగల్ మండల్ ఉమ్మడి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా గంధపు దత్తు

**విలేకరులే ప్రజలకు సమాచార వారధి.. డాక్టర్ ఎం.ఏ. అకీమ్ । శాలువాతో ఘన సన్మానం**

**పోతంగల్, సెప్టెంబర్ 23 (జనసంఘర్షణ):**




పోతంగల్ మండల కేంద్రం ఉమ్మడి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా గంధపు దత్తు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు, సామాజిక సేవకుడు డాక్టర్ ఎం.ఏ. అకీమ్ పాల్గొని నూతన అధ్యక్షుడిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.ఏ. అకీమ్ మాట్లాడుతూ.. ప్రజలకు సమాచారం చేరవేయడంలో విలేకరుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజా సమస్యలు, ప్రభుత్వ కార్యక్రమాలు, సామాజిక అంశాలు వేగంగా ప్రజలకు చేరుతున్నాయని తెలిపారు. ప్రజలకు, పాలనకు మధ్య మీడియా ఒక సమాచార వారధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు.“విలేకరి అనే పదం ఎంతో బాధ్యతతో కూడుకున్నది. ఎవరికి నచ్చినా, నచ్చకపోయినా వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావడం వారి బాధ్యత. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా పాత్ర ప్రత్యేకమైనది” అని అకీమ్ అన్నారు.పోతంగల్ మండలంలో ఉమ్మడి ప్రెస్‌క్లబ్ ఏర్పాటు కావడం సంతోషకరమని, తనకు పరిచయమైన మిత్రుడు గంధపు దత్తు అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం గర్వంగా ఉందని తెలిపారు. గతంలో ఉపాధ్యక్షుడిగా కొనసాగిన దత్తు ప్రస్తుతం అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం అభినందనీయమన్నారు. జర్నలిస్టులందరినీ సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆకాంక్షించారు.‘దత్తుతో పరిచయం నా గుర్తింపుకు కారణం’సామాజిక సేవకుడు అఖిల్ మాట్లాడుతూ.. గంధపు దత్తుతో ఏర్పడిన పరిచయం తన జీవితంలో ఎంతో విలువైనదని అన్నారు. తొలుత ఇద్దరూ ఒకరికొకరు పరిచయం లేని వారైనా, ఆ పరిచయం క్రమంగా స్నేహంగా మారిందని తెలిపారు.“ఈరోజు ప్రజల్లో నాకు కొంత గుర్తింపు ఉందంటే అందుకు దత్తు చేసిన సహకారం కూడా ఒక ముఖ్య కారణం. నా కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ఆయన అందించిన సహకారాన్ని ఎప్పటికీ మర్చిపోలేను” అని అఖిల్ సభాముఖంగా తెలిపారు.

ప్రజా సమస్యలే ప్రెస్‌క్లబ్ ప్రధాన లక్ష్యం

నూతన అధ్యక్షుడు గంధపు దత్తు మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రెస్‌క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టులందరినీ కలుపుకుని ముందుకు సాగుతూ మండలంలోని ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సమాజహితానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.“వార్త రాయడం మాత్రమే కాకుండా.. ప్రజల సమస్యలకు గొంతుకగా నిలవడం జర్నలిస్టుల బాధ్యత. ప్రెస్‌క్లబ్ వేదికగా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తాం” అని దత్తు తెలిపారు.జర్నలిస్టుల ఐక్యత, పరస్పర సహకారంతో ప్రెస్‌క్లబ్‌ను మరింత బలోపేతం చేయాలని పలువురు ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకువచ్చి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా మరింత చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, సామాజిక సేవకులు, బీఆర్ఎస్ అభిమానులు, స్థానికులు పాల్గొని గంధపు దత్తుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలు ప్రజాసేవకు మరింత ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

## నిధుల విషయంలో మహిళా వార్డు సభ్యురాలుపై దాడి.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (జన సంఘర్షణ)**



నిధుల విషయంలో మహిళా వార్డు పై దాడి చేసిన నిజాంపేట్ మండలం కల్వకుంట్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో చోటు చేసుకుంది బాధితురాలు వెంటనే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. విచారణ వేగవంతం కాకపోవడంతో తోటి వార్డు మెంబర్ పై చర్యలు తీసుకోవడానికి బుధవారం నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు మీడియాతో మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన కల్వకుంట్ల గ్రామపంచాయతీ సమావేశం సర్పంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా నిధుల విషయంపై వార్డు అభివృద్ధి కొరకు ఓ మహిళ వార్డు మెంబర్ నిధులు కావాలని ప్రశ్నించగా పక్కనే ఉన్న వార్డ్ మెంబర్ నీ వార్డుకు తక్కువ నిధులు అడగాలని బెదిరిస్తూ మహిళా వార్డు మెంబర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు నిధుల విషయంలో కేవలం గ్రామపంచాయతీ సమావేశంలోమాట్లాడినందుకు చే చేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ విషయంపై తోటి వార్డు మెంబర్ పై చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీకి ఫిర్యాదు జిల్లా పంచాయతీ అధికారికిఫిర్యాదు చేశామని తెలిపారు. వార్డ్ మెంబర్ పై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.


## వినాయక నిమజ్జనం లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మండప నిర్వాహకులు చూడాలి.

**నిమజ్జనం శనివారం సాయంత్రం నుండి ఆదివారం ఉదయం వరకు ఉంటుందన్నారు.**

**మున్సిపల్, పోలీస్, తహసిల్దార్, అగ్నిమాపక సిబ్బంది, విద్యుత్, వైద్యాధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలి.**

**రామాయంపేట మున్సిపాలిటీ లోని ఎనిమిదవ వార్డు బిజెపి కౌన్సిలర్ జంగంపల్లి శంకర్ గౌడ్ అన్నారు.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (జన సంఘర్షణ)**



మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోవినాయకనిమజ్జనంశనివారంసాయంత్రం నుండి ఆదివారం ఉదయం వరకు గణేష్ నిమజ్జన వేడుకల కు అధికారులు,మున్సిపల్, పోలీస్,తహసిల్దార్,ఫైర్,విద్యుత్, వైద్య అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలే గణేష్ మండపాల వద్ద మరియు ఊరేగిపు రహదారులు శుభ్రంగా ఉంచడం,చెట్లు, మరియు వివిధ వార్డులలో కరెంటు స్తంభాల వైర్లు లైన్లు కిందకి ఉన్న వాటిని సరి చేయడం,లైట్లు ఏర్పాటు ప్రధాన రహదారులు గుంతలు పూడ్చి సరి చేయడం హైవే వై జంక్షన్ వద్ద రోడ్డు వైపు గణేష్ వాహనాలు మారెప్పుడూ పోలీసు సిబ్బంది ఉంచడం కుంట వద్ద లైటింగ్ , టెంట్ వంటి సౌకర్యాలు కల్పించడం.నిమజ్జనం చేసే చెరువు కుంట వద్ద మట్టి రోడ్డు పనులు, చివరి వినాయకుడి నిమజ్జనం వరకు క్రెయిన్ లు అందుబాటులో ఉంచాలి.గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంచడం,ప్రభుత్వ దవాఖాన లో వైద్య సేవలు,వైద్యులు అందుబాటులో ఉండాలి.అత్యవసర సేవలు అంబులెన్స్, ఫైర్ ఇంజను వాహనాలు అందుబాటులో ఉంచడం.అన్ని ముఖ్య శాఖల అధికారులు,సిబ్బంది నిమజ్జనం పూర్తి అయే వరకు ప్రజలకు అందుబాటులో ఉండాలి.పట్టణ ప్రజలకు మరియు గణేష్ మండపాల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని అన్ని శాఖల అధికారులను కోరుతున్నాము. భక్తి శ్రద్ధలతో వినాయక నిమజ్జన వేడుకలు జరుపుకోవాలని పట్టణ ప్రజలకు కోరారు.

## ఆడపిల్ల పుట్టిందని సంబరం.. ‘తాతయ్య కానుక’గా రూ.5 వేల ఆర్థిక సాయం

**తల్లి--బిడ్డలకు బట్టల పంపిణీ.. పేద కుటుంబాలకు అండగా డాక్టర్ ఎం.ఏ. అకీమ్..ఒకే రోజు మూడు కుటుంబాలకు చేయూత**

**పోతంగల్, సెప్టెంబర్ 23 (జనసంఘర్షణ):**

ఆడపిల్ల పుట్టడం ఆ కుటుంబానికి ఆనందమే కాదు.. ఆ ఇంటికి లక్ష్మీదేవి అడుగుపెట్టినట్లేనని భావిస్తూ పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న బీఆర్ఎస్ నాయకుడు, సామాజిక సేవకుడు డాక్టర్ ఎం.ఏ. అకీమ్ మరోసారి తన సేవా కార్యక్రమంతో మానవత్వాన్ని చాటుకున్నారు.నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని హంగర్గ ఫారం గ్రామానికి చెందిన మైనార్టీ కుటుంబం రూబీనా బేగం--షేక్ గౌస్ దంపతులకు ఆడపిల్ల జన్మించడంతో, వారి కుటుంబాన్ని అభినందించిన డాక్టర్ ఎం.ఏ. అకీమ్ తన వాగ్దానం ప్రకారం ‘తాతయ్య కానుక’గా రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. అంతేకాకుండా తల్లి, చిన్నారికి బట్టలు కూడా పంపిణీ చేశారు.ఆడపిల్ల ఇంటికి లక్ష్మిగా వస్తుందని, ఆ కుటుంబంలో సంతోషం, శుభం నిండాలని ఆకాంక్షిస్తూ తల్లీబిడ్డలను ఆశీర్వదించారు. పేద కుటుంబాల్లో ఆడపిల్ల జన్మించిన సందర్భాల్లో తనవంతు సహాయాన్ని అందించాలనే ఉద్దేశంతో ‘తాతయ్య కానుక’ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు డాక్టర్ ఎం.ఏ. అకీమ్ తెలిపారు.

పేద కుటుంబాలకు ‘తాతయ్య’గా అండ!

గత ప్రభుత్వ హయాంలో ఆడపిల్లలు జన్మించిన కుటుంబాలకు కేసీఆర్ కిట్ ద్వారా ప్రయోజనాలు అందేవని గుర్తుచేసిన డాక్టర్ ఎం.ఏ. అకీమ్, ప్రస్తుతం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు తనవంతుగా చేయూత అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.పేద కుటుంబాల్లో ఆడపిల్ల జన్మించినప్పుడు తల్లి, బిడ్డకు అవసరమైన వస్తువులు,పోషకాహారం, ఇతర అవసరాలకు కొంత ఆర్థిక భరోసా అవసరమవుతుందని పేర్కొన్నారు. అందుకే ఆడపిల్ల పుట్టిన కుటుంబాలకు రూ.5 వేల ఆర్థిక సాయంతో పాటు తల్లి, బిడ్డలకు బట్టలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఒకే రోజు మూడు కుటుంబాలకు చేయూత!

పోతంగల్ మండలంలో ఒకే రోజు మూడు కుటుంబాలకు డాక్టర్ ఎం.ఏ. అకీమ్ తనవంతు ఆర్థిక సహాయం అందించడం చర్చనీయాంశంగా మారింది.ఇటీవల పాము కాటుకు గురైన ఓ మహిళ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి మెరుగైన వైద్యం పొందారు. ఈ విషయాన్ని పోతంగల్‌కు చెందిన యువకుడు ధార అఖిల్ డాక్టర్ ఎం.ఏ. అకీమ్ దృష్టికి తీసుకెళ్లడంతో, పరిస్థితిని తెలుసుకున్న ఆయన తనకు తోచిన మేరకు ఆ మహిళకు ఆర్థిక సహాయం అందించారు.అదేవిధంగా సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయస్సున్న మరో మహిళ తలనరాల సమస్యతో పాటు కంటి చూపు సరిగా కనిపించడం లేదని ఆయనను సంప్రదించారు. ఆమెకు సంబంధించిన మెడికల్ రిపోర్టులు, స్కానింగ్ రిపోర్టులను పరిశీలించిన డాక్టర్ ఎం.ఏ. అకీమ్ ప్రస్తుతం మందుల కోసం ఆర్థిక సహాయం అందించారు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోతే అవసరమైన వైద్య చికిత్స, కంటి ఆపరేషన్‌కు తనవంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

‘సేవ చేయాలనే మనసు ఉండాలి’


ఈ సందర్భంగా డాక్టర్ ఎం.ఏ. అకీమ్ మాట్లాడుతూ..



“సృష్టిలో అందరూ భగవంతుడి సృష్టే. అయితే ఆపదలో ఉన్నవారిని ఆదుకునే గుణం, మనకు ఉన్నదాంట్లో కొంత పంచే మనసు ప్రతి ఒక్కరిలో ఉండదు. పేద కుటుంబాలకు, ఆపదలో ఉన్నవారికి మనకు తోచినంత సహాయం చేయడం మన బాధ్యత. సేవా కార్యక్రమాల్లో మరికొందరు ముందుకు రావాలి” అని అన్నారు. ‘తాతయ్య కానుక’ కార్యక్రమానికి అవకాశం కల్పించిన!రూబీనా బేగం--షేక్ గౌస్ దంపతులతో పాటు గ్రామ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పేద కుటుంబాలకు తనవంతు సహాయం అందిస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని పేర్కొన్నారు.

‘సామాన్యుడైనా.. సేవలో ముందుండాలి’

ప్రజల నుంచి కూడా డాక్టర్ ఎం.ఏ. అకీమ్ సేవా కార్యక్రమాలపై అభినందనలు వ్యక్తమవుతున్నాయి. “ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఆర్థికంగా స్థోమత ఉన్నవారు అనేకమంది ఉన్నప్పటికీ.. ఒక సామాన్య నాయకుడు తనకు తోచిన విధంగా పేదలకు అండగా నిలవడం అభినందనీయం” అని కొందరు స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.“పదవి కంటే సేవ చేసే మనసే గొప్పది. పేద కుటుంబంలో ఆడపిల్ల పుట్టిన ఆనందాన్ని పంచుకోవడం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం నిజమైన మానవత్వానికి నిదర్శనం” అంటూ పలువురు ప్రశంసిస్తున్నారు.ప్రజలకు అవసరమైన సమయంలో తనవంతు సహాయం చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్న డాక్టర్ ఎం.ఏ. అకీమ్ సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.



# ఘనంగా ఎస్పీ జన్మదిన వేడుకలు.





**ఎస్పీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న అధికారులు,సిబ్బంది.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (జన సంఘర్షణ)**

జిల్లా పోలీస్ కార్యాలయంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అధికారులు,సిబ్బంది సమక్షంలో ఎస్పీ కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పోలీసు అధికారులు ఎస్పీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అధికారులు,సిబ్బంది చూపిన ఆత్మీయతకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ సమన్వయంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని ఎస్పీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# చేయూత పింఛన్ల మంజూరు దరఖాస్తులు వార్డుల వైస్గా వెరిఫికేషన్ చేసుకోవాలి.





**మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్ అన్నారు.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (జన సంఘర్షణ)**

ప్రభుత్వ ఆదేశంల ప్రకారంగా చేయూత పెన్షన్ల మంజూరు గురించి దరఖాస్తు చేసుకున్న వారు అర్హులు లేదా అనర్హులు అని గుర్తించడానికి పట్టణంలో వార్డుల వారిగా వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుచున్నది. ఇందులో భాగముగా బుధవారం పట్టణం లోని వివిధ వార్డులలో మున్సిపల్ కమిషనర్ వై నవీన్ వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు.ఈ వెరిఫికేషన్ ప్రక్రియ తేదీ. 25.09.2026 కొనసాగబడును అని మున్సిపల్ కమిషనర్ శ్రీ వై నవీన్ తెలియజేసినారు.ఇట్టి విషయంలో పట్టణంలోని చేయూత పెన్షన్ దరఖాస్తు దారులకు తెలియజేయునది ఏమనగా పెన్షన్ వెరిఫికేషన్ సమయంలో అడిగిన అన్ని ధ్రువీకరణ పత్రములు సమర్పించి సిబ్బందికి సహకరించగలరని కోరనైనది.

# రైతులు సంఘటితం కావాలి.





**రైతు ఉత్పత్తి దారుల సంఘం గా ఏర్పడాలి.**

**మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (జన సంఘర్షణ)**

ఫార్మర్ ప్రొడక్షన్ ఆర్గనేషన్ వాటి ప్రాముఖ్యతపై రామాయంపేట మండలం ఝాన్సింగ్ లింగాపూర్ గ్రామంలో రైతులతో అవగాహన సదస్సు మరియు క్షేత్రస్థాయి పరిశీలన చేయడం జరిగింది.గ్రామీణ వ్యవసాయాన్ని బలోపేతం చేయడానికి మరియు రైతుల ఆదాయాన్ని పెంచడానికి ఒక చారిత్రాత్మక అడుగుగా,మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటుపై ఒక ప్రత్యేక అవగాహన సదస్సు మరియు క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి,తునికి కెవికె వ్యవసాయ శాస్త్ర వేత్తలు డాక్టర్ శ్రీకాంత్,డాక్టర్ శ్రీనివాస్ గార్లు మాట్లాడుతూ చిన్న మరియు సన్నకారు రైతులు ఎదుర్కొంటున్న సాగు కష్టాలను అధిగమించడానికి ఫ్పీూలు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. రైతులందరూ ఒక సంఘంగా ఏర్పడటం ద్వారా నాణ్యమైన ఎరువులు, విత్తనాలను తక్కువ ధరకు పొందవచ్చని, దళారీ వ్యవస్థ లేకుండా తమ ఉత్పత్తులను నేరుగా మార్కెట్లో అమ్ముకుని మంచి లాభాలు పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా రైతుల కొరకు ప్రత్యేకంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. దీని ద్వారా రైతులు సామూహిక సాగు పద్ధతులు,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మరియు పంట నిల్వ విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించి తెలుసుకున్నారు. ఎఫ్ పి వో ల ఏర్పాటుకు ప్రభుత్వాల నుండి లభించే ఆర్థిక సహాయం,రాయితీలు మరియు సాంకేతిక పరిజ్ఞానం గురించి అధికారులు రైతులకు వివరించారు.ఝాన్సీ లింగాపూర్ గ్రామ రైతులు ఈ కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేస్తూ,ఎఫ్ పి ఓ ఏర్పాటు ద్వారా తాము ఆర్థికంగా నిలదొక్కుకోవడంతో పాటు ఆధునిక వ్యవసాయంలో ముందంజ వేయగలమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ మానెగల రామకృష్ణయ్య, వ్యవసాయ అధికారి, కె వి కె శాస్త్ర వేత్తలు, ఏ ఈ ఓ రైతులు,పెద్దమనుషులు పాల్గొన్నారు.



## నిబంధనల మేరకే ఓటరు సవరణ.ఆర్డీవో రమాదేవి.

**మెదక్ ఆర్డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (జన సంఘర్షణ)**



మెదక్ ఆర్డీఓ రమాదేవి అధ్యక్షతన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఈవో, తెలంగాణ వారు 21న నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జారీ చేసిన సూచనలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ముఖ్యంగా,కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకునే సందర్భంలో డిక్లరేషన్ ఫారం సమర్పించడం తప్పనిసరి అని తెలిపారు.అలాగే ఫారం-6, ఫారం-7 మరియు ఫారం-8లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ప్రాసెసింగ్, పరిశీలన, డిస్పోజల్ స్థితిగతులపై సమావేశంలో చర్చించారు. పెండింగ్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి,సకాలంలో పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా సమీక్షించారు. అదేవిధంగా, సర్ లో భాగంగా 34-మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మ్యాపింగ్ కాని ఓటర్లు మరియు అనామలీస్‌కు సంబంధించి జారీ చేసిన నోటీసులపై నిర్వహించిన హియరింగ్స్,వాటి డిస్పోజల్ మరియు ప్రస్తుత స్థితిగతులపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆర్డీఓ రమాదేవి కోరారు.

## బజరంగ్ గణేష్ మండలికి బియ్యం సంచుల వితరణ

**సహాయం అందించిన సంతోష్‌కు ఘన సన్మానం.. 'సేవ మనది.. ప్రతిఫలం ఆ భగవంతుడిది'**

**తగిలేపల్లి, సెప్టెంబర్ 23 (జనసంఘర్షణ):**



తగిలేపల్లి గ్రామంలోని బజరంగ్ గణేష్ మండలి సభ్యులకు అన్నదాన కార్యక్రమం కోసం బియ్యం సంచులు అందించిన సంతోష్‌ను మండలి సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మండలి సభ్యులు సంతోష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భక్తి కార్యక్రమాలకు, అన్నదాన సేవలకు తనవంతు సహకారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బేగరి మారుతి, నరేష్, చరణ్, ఈశ్వర్, అనిల్, కార్తీక్, ఆకాష్, సిద్దు, జస్వంత్, సంపత్ తదితరులు పాల్గొన్నారు. "సేవ, సహాయం మనది.. ప్రతిఫలం ఆ భగవంతుడిది" అనే సందేశంతో సేవా కార్యక్రమాలకు సహకరించడం స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు.

## యువతి అనుమానాస్పద మృతి.. మృతదేహంపై గాయాలు

**బాత్‌రూమ్ పక్కన మృతదేహం.. ఘటనపై పలు అనుమానాలు.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**భద్రాద్రి కొత్తగూడెం /జూలూరుపాడు, సెప్టెంబర్ 23/:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామంలో ఇంద్రపల్లి హరిణి (18) అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో బాత్‌రూమ్ పక్కన హరిణి మృతదేహం కనిపించింది. మృతదేహంపై గాయాలు ఉన్నట్లు గుర్తించడంతో ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి, యువతి మృతికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. యువతి మృతి ప్రమాదవశాత్తు జరిగిందా, మరేదైనా కారణం ఉందా అనే విషయాలు పోలీసుల దర్యాప్తు, పోస్టుమార్టం నివేదిక అనంతరం స్పష్టమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి.

**ఈ-మెయిల్ హ్యాక్‌తో రూ.17.20 లక్షల మోసం రూ.7.33 లక్షలు నిలుపుదల.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (జన సంఘర్షణ)**



సైబర్ మోసాల పట్ల ప్రజలు, సంస్థలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. బ్యాంకు ఖాతా లేదా చెల్లింపు వివరాల్లో మార్పులు కోరుతూ వచ్చే ఈ-మెయిల్, వాట్సాప్ సందేశాలను ముందుగా ఫోన్‌లో నిర్ధారించుకోవాలని తెలిపారు.మనోహరాబాద్‌కు చెందిన ఎంఎల్ఆర్ ఆటో లిమిటెడ్ సంస్థ అధికారిక ఈ-మెయిల్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతా వివరాలు మార్చినట్లు నమ్మించి రూ.17,20,745 బదిలీ చేయించారు. సంస్థ ఫిర్యాదు అందుకున్న పోలీసులు లావాదేవీలను పరిశీలించి బ్యాంకులతో సమన్వయం చేశారు. దీంతో రూ.7,33,278ను నిలుపుదల చేసి,చట్టపరమైన ప్రక్రియ అనంతరం సంస్థకు తిరిగి అందజేశారు. ఈ ఘటనపై మనోహరాబాద్‌పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.పోలీసుల సత్వర స్పందనతో నగదు తిరిగి అందడంపై ఎంఎల్ఆర్ ఆటో లిమిటెడ్ ప్రతినిధులు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.పెద్ద మొత్తంలో నగదు బదిలీ చేసే ముందు అకౌంట్ నంబర్, ఐఎఫ్ఎస్సి, లబ్ధిదారుడి పేరు సరిచూసుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ-మెయిల్ ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్, టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ ఉపయోగించాలని, అనుమానాస్పద లింకులు, అటాచ్‌మెంట్లు ఓపెన్ చేయవద్దని తెలిపారు.ఓటీపీ, పాస్‌వర్డ్, బ్యాంకు వివరాలను ఎవరికీ చెప్పవద్దన్నారు. మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి, ఎఎవతీఎతీఅఎవ.ఙ్రశీజ.ఱఅలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## శ్రీ ఇంద్ర యువ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

**మద్నూర్ /సెప్టెంబర్ 23/(జన సంఘర్షణ)**

శ్రీ ఇంద్ర యువ గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పవిత్ర అన్నదాన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కలగడం ఎంతో ఆనందంగా ఉందని బండివార్ హన్మాండ్లు, మద్నూర్ తెలిపారు.ఈ సందర్భంగా శ్రీ ఇంద్ర యువ గణేష్ మండలి కమిటీ సభ్యులు, యువకులు బండివార్ హన్మాండ్లును సన్మానించారు. తనను సన్మానించిన మండలి కమిటీ సభ్యులు, యువకులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ బండివార్ హన్మాండ్లు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే శ్రీ ఇంద్ర యువ గణేష్ మండలి కమిటీ సభ్యులందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. "గణపతి బప్పా మోరియా! జై శ్రీ గణేష్!" అని పేర్కొంటూ, "ఇట్లు మీ బండివార్ హన్మాండ్లు" తెలిపారు.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక

# నల్ల పోచమ్మ రైతు ఉత్పత్తి సాయ సహకార సంఘం కార్యాలయం ప్రారంభం.

**ఝాన్సీ లింగాపూర్ గ్రామంలో సర్పంచ్ చేతుల మీదుగా ప్రారంభించారు.**



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (జన సంఘర్షణ)**



మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామంలో శ్రీ నల్ల పోచమ్మ రైతు ఉత్పత్తి సహాయ సహకార సంఘం ఎఫ్ పి ఓ ఝాన్సీ లింగాపూర్ లో నూతన ఆఫీస్ ను గ్రామ సర్పంచ్ మానేగాళ్ళ రామకిష్టయ్య, ఏవో ప్రవీణ్ కుమార్,అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు శ్రీనివాస్.శ్రీకాంత్ ఎఫ్ పి ఓ చైర్మన్ బండమీదీ సల్మాన్,ఉపసర్పంచ్ మదూరి మహేష్,గ్రామ కార్యదర్శి శ్రీమతి సమత ల చేతుల మీదుగా ప్రారంభించటం జరిగింది. ఇందులో పాల్గొన్న రైతులకు ఏ రకమైన పంటలు వేయాలో ఏ పంట వేస్తే లాభాలు ఎలా ఉంటాయో అనేదానిపై వివరించటం జరిగింది. ఇందులో పాల్గొన్న వారు మాజీ ఉపసర్పంచ్ బానప్పగారి సుధాకర్ రెడ్డి.మాజీ వార్డు సభ్యులు చాకలి పోచయ్యా టేకుమట్లసత్యనారాయణ.వార్డు సభ్యులు.కోళ్ల నవీన్. సాలిపేట సిద్ధారంలు.నరసగల్ల శివయ్య. బండమిది రాజు.మాసాయిపేట భూచవ్వ. లింబాద్రి.భాగ్య.భూచవ్వ. మమత.తొగరిభూచవ్వ. లక్ష్మారెడ్డి. సిద్ధారంలు,ఆవుల నర్సయ్య,శ్యామయ్య,చల్ల కిష్టయ్య తదితరులు పాల్గొని విజయవంతం చేయటం జరిగింది.

# ఏటీఎంల భద్రతను మరింత పటిష్టం చేయాలి.

**ఆధునిక సాంకేతికతతో భద్రతా చర్యలు చేపట్టాలి.**

**ఎస్‌బీఐ అధికారులతో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సమావేశం.**




**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (జన సంఘర్షణ)**



తూప్రాన్ లో ఇటీవల కాలంలో ఏటీఎంల వద్ద జరుగుతున్న దొంగతనాల నేపథ్యంలో భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సూచించారు.బుధవారం తూప్రాన్‌లో భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్‌బీఐ) ఏటీఎం విభాగం అధికారులతో ఆయన ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏటీఎం కేంద్రాల వద్ద భద్రతను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.పాత ఏటీఎం యంత్రాలను తొలగించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కొత్త యంత్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి ఏటీఎం కేంద్రం వద్ద 24 గంటలూ భద్రతా సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఏటీఎం కేంద్రాల వద్ద నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి,అవి నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు. అత్యవసర భద్రతా వ్యవస్థ (ఈఎస్ఎస్)ను ఏర్పాటు చేసి అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే గుర్తించేలా చర్యలు చేపట్టాలని కోరారు. సీసీ కెమెరాల దృశ్యాలను నిర్దిష్ట కాలవ్యవధి వరకు భద్రపరిచేలా చూడాలని తెలిపారు.ఏటీఎం కేంద్రాల్లో భద్రతా లోపాలను గుర్తించిన వెంటనే వాటిని పరిష్కరించాలని,అవసరమైన సందర్భాల్లో పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని డీఎస్పీ సూచించారు. ఏటీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.సమావేశంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, రామాయంపేట సీఐ సైదా, డీసీఆర్‌బీ సీఐ జార్జ్, ఎస్‌బీఐ ఏటీఎం విభాగం జీఎం రాజేష్ ప్రసాద్, ఫీల్డ్ ఆఫీసర్ జయప్రసాద్,ఏటీఎం భద్రతా ఇన్‌చార్జి ఆనంద్ రాజ్, ఆర్ఎం మారుతి, డీజీఎం భువనేశ్వరి, ఏటీఎం నగదు ఇన్‌చార్జి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రాందేవ్ బాబా ఆధ్వర్యంలో యోగా శిక్షణకు రుద్రూర్ యోగా శిక్షకులు

**అసిస్టెంట్ యోగా కోర్సు పూర్తి.. ప్రిన్సిపల్ యోగా శిక్షణ కోసం హరిద్వార్‌కు పయనం**

**రుద్రూర్/సెప్టెంబర్ 23/(జన సంఘర్షణ)**




రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రంలోని మహర్షి పతంజలి యోగా ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో అసిస్టెంట్ యోగా కోర్సును పూర్తి చేసిన నలుగురు యోగా శిక్షకులు, ప్రిన్సిపల్ యోగా శిక్షణ కోసం హరిద్వార్‌లోని పతంజలి యోగా పీఠ్‌కు బయలుదేరారు.ప్రపంచ ప్రసిద్ధి గాంచిన యోగా గురువు రాందేవ్ బాబా ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణకు చిదుర మహిపాల్, అడప శంకర్, నరేందర్, గాండ్ల సాయన్న హాజరుకానున్నారు. ఈ శిక్షణ ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు కొనసాగుతుందని యోగా మాస్టర్ డాక్టర్ విశ్వనాథ్ మహాజన్, బాలరాజ్, బెజగం వెంకటేశం గుప్తా, కె.వి. మోహన్ సార్, గబలే పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు.

# గిరిజన ఏజెన్సీ యువతకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలి

**సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, గిరిజన ప్రజాప్రతినిధులు, మంత్రులు**

**ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక కోటా అమలు చేయాలని వినతి**

**అశ్వారావుపేట. సెప్టెంబర్ 23 ( జన సంఘర్షణ )**



గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లోన యువతకు ఉద్యోగ నియామకాల్లో 75 శాతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆధ్వర్యంలో పలువురు గిరిజన ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కలిశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్తో కలిసి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే కొమరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఇతర గిరిజన ప్రజాప్రతినిధులు ఏజెన్సీ ప్రాంతాల యువతకు ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయాల్సిన అవసరాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

ఏజెన్సీ యువతకు ఉద్యోగాల్లో ప్రత్యేక ప్రాధాన్యత

ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా 2026 పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో ఏజెన్సీ ప్రాంతాలకు సంబంధించిన పోస్టుల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు.మారుమూల గిరిజన గ్రామాల్లోని యువతకు విద్య, శిక్షణ, రవాణా తదితర సదుపాయాలు పరిమితంగా ఉండటంతో సాధారణ పోటీ ప్రక్రియలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజాప్రతినిధులు వివరించారు. ఏజెన్సీ ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని స్థానిక యువతకు ప్రత్యేక అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

అశ్వారావుపేట నియోజకవర్గ యువత తరఫున ఎమ్మెల్యే విజ్ఞప్తి


అశ్వారావుపేట నియోజకవర్గంలో గిరిజన ఏజెన్సీ ప్రాంతాలు విస్తారంగా ఉన్నాయని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లోని అనేక గ్రామాలకు చెందిన గిరిజన యువత ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్నారని వివరించారు.ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి సిద్ధమవుతున్న యువతకు 75 శాతం ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు లభిస్తాయని, తద్వారా గిరిజన కుటుంబాల ఆర్థిక పరిస్థితుల్లో కూడా మార్పు వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.గత ప్రత్యేక నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలిఏజెన్సీ ప్రాంతాలకు గతంలో అమలైన ప్రత్యేక రిజర్వేషన్ నిబంధనలు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, గెజిట్ నోటిఫికేషన్లను పరిశీలించి ప్రస్తుత పోలీస్ నియామక ప్రక్రియలో కూడా 75 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని గిరిజన ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారు.చట్టపరమైన, పరిపాలనా అంశాలను పరిశీలించి ఏజెన్సీ ప్రాంతాల స్థానిక గిరిజన యువతకు ప్రయోజనం కలిగే విధంగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రులు, గిరిజన ప్రజాప్రతినిధుల దృష్టి ఈ అంశాన్ని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గిరిజన యువతకు ఉద్యోగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రి దనసరి అనసూయ సీతక్క, మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ తదితరులు ఉన్నారు. అయితే వీరందరూ ఈ ప్రత్యేక భేటీలో పాల్గొన్నారని కాకుండా, రాష్ట్ర మంత్రివర్గ సభ్యులుగా మాత్రమే ఈ సందర్భంలో ప్రస్తావించబడుతున్నారు.

పోలీస్ ఉద్యోగాల భర్తీ నేపథ్యంలో కీలక డిమాండ్ రాష్ట్రంలో పోలీస్ శాఖలో ఖాళీల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఏజెన్సీ యువతకు 75 శాతం రిజర్వేషన్ డిమాండ్ ప్రాధాన్యత సంతరించుకుంది. పోలీస్ ఉద్యోగాల కోసం గిరిజన ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువత సిద్ధమవుతున్న నేపథ్యంలో, నియామకాల్లో తమకు ప్రత్యేక కోటా కల్పించాలని వారు కోరుతున్నారు. స్థానిక గిరిజన యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు. పోలీస్ శాఖలో స్థానిక యువతకు అవకాశాలు లభిస్తే గిరిజన ప్రాంతాల్లోనే ఉద్యోగ అవకాశాలు పెరగడంతో పాటు యువతలో ప్రభుత్వ ఉద్యోగాలపై మరింత ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలి ఏజెన్సీ ప్రాంతాల్లోని యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కోరారు. ఉద్యోగ అవకాశాల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గించి, స్థానికంగానే ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక విధానాలు అవసరమని తెలిపారు. ప్రస్తుత పోలీస్ నియామక ప్రక్రియలోనే ఏజెన్సీ ప్రాంతాల యువతకు 75 శాతం రిజర్వేషన్ అమలు చేసే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రిని కోరారు. సీఎం నిర్ణయంపై గిరిజన యువతలో ఆసక్తి 75 శాతం రిజర్వేషన్ డిమాండ్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఏజెన్సీ ప్రాంతాల గిరిజన యువతలో ఆసక్తి నెలకొంది. ప్రభుత్వం సంబంధిత నిబంధనలు, చట్టపరమైన అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని యువత కోరుతోంది. పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో 75 శాతం ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయాలన్న డిమాండ్‌పై ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం ఏజెన్సీ ప్రాంతాల నిరుద్యోగ యువత ఎదురుచూస్తోంది. గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశామని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు.

# అత్తాపూర్ పీఎస్‌లో న్యాయవాదులు--పోలీసుల మధ్య వివాదం

**న్యాయవాది ఫోన్ లాక్కునే యత్నంపై అభ్యంతరం.. మహిళా న్యాయవాదితోనూ పోలీసుల వాగ్వాదం**

**హైదరాబాద్/సెప్టెంబర్ 23/(జన సంఘర్షణ)**



హైదరాబాద్: అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాదులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. స్టేషన్ బెయిల్ విషయంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన న్యాయవాదితో పోలీసులు వాగ్వాదానికి దిగినట్లు వీడియోలో కనిపించగా, న్యాయవాది చేతిలోని ఫోన్‌ను లాక్కునే ప్రయత్నం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనను వీడియో తీస్తున్న మహిళా న్యాయవాదితోనూ పోలీసులు దురుసుగా ప్రవర్తించారని న్యాయవాదులు ఆరోపిస్తున్నారు.వీడియో చిత్రీకరణ విషయంలో పోలీసు సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం తలెత్తినట్లు స్థానిక నివేదికలు పేర్కొన్నాయి. మహిళా న్యాయవాది చేతిలోని ఫోన్‌ను తీసుకునేందుకు ప్రయత్నించడంతో ఆమె పోలీసులను ప్రశ్నించిన దృశ్యాలు కూడా వీడియోలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి.

గుట్కా ప్యాకెట్ల వ్యవహారమే వివాదానికి కారణమంటున్న పోలీసులు

కస్టడీలో ఉన్న నిందితుడికి వాటర్ బాటిల్‌తో పాటు గుట్కా/పాన్ మసాలా ప్యాకెట్లు అందించేందుకు ప్రయత్నం జరిగిందని పోలీసులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై అభ్యంతరం వ్యక్తం చేయడంతోనే వివాదం ప్రారంభమైందని రాజేంద్రనగర్ డీసీపీ ఎస్. శ్రీనివాస్ వెల్లడించినట్లు సియాసత్ నివేదించింది. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను పోలీసులు పరిశీలనకు తెచ్చినట్లు కూడా పేర్కొంది.



పోలీసుల తీరుపై న్యాయవాదుల అభ్యంతరంఅయితే, న్యాయవాదుల వాదన మరోలా ఉంది. నిందితుడికి గుట్కా ప్యాకెట్లు అందించినట్లయితే సీసీటీవీ ఆధారంగా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని, అందుకు బదులుగా న్యాయవాదుల ఫోన్లు లాక్కోవడం, వారితో తోపులాటకు దిగడం సమంజసం కాదని వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.ప్రత్యేకంగా మహిళా న్యాయవాది వీడియో చిత్రీకరిస్తున్న సమయంలో ఆమె చేతిలోని ఫోన్‌ను లాక్కునేందుకు పురుష పోలీసు సిబ్బంది ప్రయత్నించడంపై న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల ప్రవర్తనపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.పోలీసులకు న్యాయవాదుల హెచ్చరిక "విషయం ఏదైనా చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి. న్యాయవాదులతో అనుచితంగా వ్యవహరించడం, వారి ఫోన్లు లాక్కోవడం, మహిళా న్యాయవాదితో దురుసుగా ప్రవర్తించడం వంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు జాగ్రత్త వహించాలి. న్యాయవాదులు తప్పు చేసి ఉంటే చట్టపరమైన విధానంలో చర్యలు తీసుకోవాలి తప్ప, వ్యక్తిగతంగా దురుసుగా వ్యవహరించడం సరికాదు" అని న్యాయవాదులు హెచ్చరిస్తున్నారు. ఈ ఘటనపై ఇరువర్గాల వాదనలు వెలువడిన నేపథ్యంలో, పూర్తి సీసీటీవీ దృశ్యాలు మరియు అధికారిక విచారణ ద్వారా వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. తాజా నివేదిక ప్రకారం, ఉన్నతాధికారులు బార్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడి, న్యాయవాదులతో అభ్యంతరకరంగా ప్రవర్తించారనే ఆరోపణలు ఎదుర్కొన్న సిబ్బందితో క్షమాపణ చెప్పించినట్లు సమాచారం.

# తిరుమల శ్రీవారి పుష్కరిణిలో ముగిసిన చక్రస్నానం





**చక్రస్నానంతో ముగిసిన సాలకట్ల బ్రహ్మోత్సవాలు**

**తిరుమల/సెప్టెంబర్ 23/(జన సంఘర్షణ)**

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం శ్రీవారి పుష్కరిణిలో నిర్వహించిన స్నపన తిరుమంజనం, చక్రస్నానంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు చక్రతాళ్వారుకు పుష్కరిణిలో మూడుసార్లు పవిత్ర స్నానం చేయించారు. అనంతరం పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. తొమ్మిది రోజులపాటు జరిగిన బ్రహ్మోత్సవాల్లో కలియుగ దైవం శ్రీనివాసుడు వివిధ వాహనాలపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. తొమ్మిదో రోజు మహారథంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీనివాసుడు మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహారథంపై ఊరేగిన శ్రీవారిని దర్శించుకునేందుకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. బుధవారం పుష్కరిణిలో అర్చకులు చక్రస్నానం నిర్వహించడంతో సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి.

# జిల్లాస్థాయి పాఠశాల క్రీడా పోటీలలో పాల్గొన్న బాలురందర్నీ అభినందించారు.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (జన సంఘర్షణ)**

జిల్లా స్థాయి పాఠశాల క్రీడా పోటీలలో పాల్గొంటున్న అండర్-14 మరియు అండర్-17 బాలురందరినీ అభినందిస్తున్నాను.ప్రియమైన విద్యార్థులారా, మీరు ఈ పోటీలకు కేవలం పతకాలు లేదా ట్రోఫీలు గెలవడానికి మాత్రమే రాలేదు. మీ ప్రతిభను నిరూపించుకోవడానికి,మీ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి, కొత్త అనుభవాలను పొందడానికి భవిష్యత్తులో గొప్ప క్రీడాకారులుగా ఎదగడానికి వచ్చారు. గెలుపు చాలా ఆనందాన్ని ఇస్తుంది. కానీ ఓటమి కూడా మనకు ఒక గొప్ప పాఠాన్ని నేర్పుతుంది. అందుకే గెలిచినప్పుడు వినయంగా ఉండండి, ఓడిపోయినప్పుడు నిరుత్సాహపడకుండా మీ తప్పులను తెలుసుకుని మరింత కష్టపడి ముందుకు సాగండి.మైదానంలో ప్రతిభతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన,జట్టు స్ఫూర్తి మరియు క్రీడాస్ఫూర్తి చాలా ముఖ్యం.మీ కోచ్‌లు వ్యాయామ ఉపాధ్యాయులు ఇచ్చే సూచనలను పాటించండి. ప్రత్యర్థి జట్టును గౌరవించండి. ఆట నియమాలను పాటించండి. చివరి క్షణం వరకు పోరాడే స్ఫూర్తిని కలిగి ఉండండి.




# నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్‌పై ఏసీబీ కేసు





**తెలిసిన ఆదాయానికి మించి రూ.6.13 కోట్ల ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు.. 8 ప్రాంతాల్లో సోదాలు**

**హైదరాబాద్/సెప్టెంబర్ 23/(జన సంఘర్షణ)**

హైదరాబాద్: నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ నోరి లక్ష్మీ భాస్కర్‌పై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు నమోదు చేసింది. తెలిసిన ఆదాయ వనరులకు పొంతన లేకుండా సుమారు రూ. 6.13 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ ఆరోపించింది. ఈ కేసులో భాగంగా హైదరాబాద్ సహా మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.సోదాల్లో హైదరాబాద్‌లోని 8 ఫ్లాట్లు, విశాఖపట్నంలో 800 చదరపు గజాల ప్లాట్‌తో పాటు మరో 5 ఓపెన్ ప్లాట్లు గుర్తించినట్లు సమాచారం. అలాగే రూ. 41 లక్షల బ్యాంకు బ్యాలెన్స్‌లు, రూ. 12 లక్షల పోస్టాఫీస్ డిపాజిట్లు, రూ. 35 లక్షల ప్రైవేట్ ఆర్థిక పెట్టుబడులు, రూ. 29.55 లక్షల మ్యూచువల్ ఫండ్స్ ఉన్నట్లు ఏసీబీ గుర్తించినట్లు పేర్కొంది.అదేవిధంగా 517.8 గ్రాముల బంగారం, జాగ్వార్, ఆడి, టాటా నెక్సాన్ కార్లతో పాటు నాలుగు ద్విచక్ర వాహనాలు, సుమారు రూ. 5 లక్షల విలువైన గాడ్జెట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. మరోవైపు రూ. 1.30 కోట్ల పెట్టుబడులు, రూ. 1.33 కోట్లను ఇతరులకు చేతి రుణాలుగా ఇచ్చినట్లు కూడా ఏసీబీ పేర్కొన్నట్లు సమాచారం. ఆస్తులపై కొనసాగుతున్న ధ్రువీకరణ సోదాల్లో గుర్తించిన ఆస్తులు, పెట్టుబడులు, లావాదేవీలకు సంబంధించిన పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. తదుపరి ఆస్తుల ధ్రువీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(1)(బి), 13(2) కింద కేసు నమోదు చేసినట్లు ఏసీబీ తెలిపింది. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. అవినీతిపై సమాచారం ఇవ్వండి ప్రజలు ఎక్కడైనా లంచం డిమాండ్ చేయడం, అవినీతి లేదా అక్రమ వసూళ్లు జరుగుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత ఏసీబీ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అవినీతిని అరికట్టడంలో ప్రజల సహకారం కీలకమని అధికారులు పేర్కొంటున్నారు.



## బీర్కూర్ ప్రధాన రహదారి దుస్థితి

**పట్టించుకోని కాంట్రాక్టర్.. నిద్రమత్తులో రోడ్లు భవనాల శాఖ?**

**బీర్కూర్,/సెప్టెంబర్ 23/(జన సంఘర్షణ)**




బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై మురికి నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా సమస్య కొనసాగుతున్నా శాశ్వత పరిష్కారం చూపలేదని వారు ఆరోపిస్తున్నారు.ప్రధాన రహదారిపై మురికి నీరు ప్రవహించకుండా కల్వర్టు నిర్మించి, మురికి కాలువలను అనుసంధానం చేయాల్సి ఉన్నప్పటికీ పనులు పూర్తికాకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో రహదారి బురదమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు.బీర్కూర్‌కు రాకపోకలకు ఈ రహదారి కీలకమైనదని, పాఠశాల విద్యార్థులు, ప్రజలు వివిధ అవసరాల కోసం ఇదే మార్గంలో ప్రయాణిస్తుంటారని స్థానికులు తెలిపారు. సమస్యపై కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించి పనులను పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులు ఎక్కడ?

బాన్సువాడ--బీర్కూర్ ప్రధాన రహదారిపై రూ. 39 లక్షలతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు నిధులు మంజూరైనప్పటికీ పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళ రహదారి చీకటిమయంగా మారడంతో డివైడర్లు వాహనదారులకు స్పష్టంగా కనిపించక ప్రమాదాల ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి

ఎన్నికలు పూర్తయిన తర్వాత రాజకీయాలను పక్కనపెట్టి గ్రామాభివృద్ధికి పాలకులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్థానికులు కోరుతున్నారు. రాజకీయ కారణాలతో అభివృద్ధి పనులు నిలిచిపోతే ప్రజలే ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు పేర్కొంటున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీర్కూర్ ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీటికి శాశ్వత పరిష్కారం చూపాలని, కల్వర్టు నిర్మాణం పూర్తి చేసి మురికి కాలువలను అనుసంధానం చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే సెంట్రల్ లైటింగ్ పనులను త్వరగా పూర్తి చేసి రాత్రి వేళ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తూ బురదమయంగా మారిన దృశ్యాలను 'మన తెలుగు దినపత్రిక' తన కెమెరాలో బంధించింది.

## మెదక్ ఎస్పీ శ్రీనివాసరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దళిత సంఘాల నేతలు.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23(జన సంఘర్షణ)**




మెదక్ జిల్లా కేంద్రంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీనివాసరావు గారిని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దళిత సంఘాల నేతలు.ఈ సందర్భంగా ఎస్పీ గారికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించారు.ఆయన ఆరోగ్యంగా ఉండి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ టీ ఎస్ జిల్లా అధ్యక్షుడు గరుగుల శ్రీనివాస్, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలసాయి హరిప్రసాద్,మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మాసన్నగారి నాగరాజ్, నిజాంపేట్ ఎమ్అర్ పీఎస్ మండల అధ్యక్షుడు జనగామ స్వామి, ఎన్ సీ డబ్ల్యూ సీ కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు అర్క అశోక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కల్లు యాదన్న, కాంగ్రెస్ నాయకులు సంగి యాదయ్య, నీలకంటి సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక ప్రదేశాల పరిశుభ్రతకు ప్రాధాన్యత.

**జిల్లా అదనపు కలెక్టర్ నగేష్.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23(జన సంఘర్షణ)**

పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ సూచించింది.బుధవారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో పర్యాటక దినోత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ మెదక్ జిల్లాకు గొప్ప చారిత్రక,సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ప్రకృతి సంపద ఉందని, జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు వస్తుంటారని పేర్కొన్నారు. పర్యాటక ప్రాంతాల పరిశుభ్రతను కాపాడటం ద్వారా సందర్శకులకు మంచి అనుభూతిని కల్పించడంతో పాటు జిల్లాకు పర్యాటకంగా మరింత గుర్తింపు లభించేలా చేయవచ్చన్నారు.జిల్లాలోని మెదక్ ఖిల్లా,చర్చి, ఏడుపాయల వనదుర్గాభవాని ఆలయం,పోచారం వన్యప్రాణి అభయారణ్యం,నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్,చారిత్రక కోటలు,చెరువులు, జలపాతాలు,దేవాలయాలు తదితర పర్యాటక ప్రదేశాల్లో ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు,మున్సిపల్ కమిషనర్ నవీన్, ఈ డి యం సందీప్,మహేందర్,ఆర్ ఐ లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక

# గణేష్ నిమజ్జనాన్ని పర్యవేక్షించిన తహసీల్దార్ సవాయి సింగ్

- **బీర్కూర్‌లో ప్రశాంతంగా ముగిసిన గణేష్ నిమజ్జన కార్యక్రమాలు**

బీర్కూర్,/సెప్టెంబర్ 23/(జన సంఘర్షణ)




బీర్కూర్ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన గణేష్ నిమజ్జన కార్యక్రమాలను తహసీల్దార్ సవాయి సింగ్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఆయనతో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ధర్మతేజ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యామ రాములు నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.గణేష్ మండళ్ల నిర్వాహకులు సకాలంలో నిమజ్జన కార్యక్రమాలను పూర్తి చేయాలని తహసీల్దార్ సూచించారు. ఆయన ఆదేశాల మేరకు మండళ్ల నిర్వాహకులు నిమజ్జన కార్యక్రమాలను త్వరగా పూర్తి చేశారు.తహసీల్దార్ సవాయి సింగ్ ఆధ్వర్యంలో బాజన్ చెరువు వద్ద నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గంగపుత్రులను ఏర్పాటు చేసి, వారి సహకారంతో వాహనాల్లో తీసుకొచ్చిన గణేష్ విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేశారు. చిన్నపిల్లలను చెరువు వద్దకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వరుసగా వచ్చిన వాహనాలను ఒక్కొక్కటిగా చెరువు సమీపానికి తీసుకువచ్చి నిమజ్జనం సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు. బీర్కూర్ ఎస్సై రాములు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తూ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టారు. అధికారులు, పోలీసుల సమన్వయంతో బీర్కూర్ మండల కేంద్రంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.

## కౌలాస్ నాలా ప్రాజెక్ట్‌కు పెరుగుతున్న ఇన్‌ఫ్లోలు

**దిగువ ప్రాంత ప్రజలకు హెచ్చరిక.. ఏ సమయంలోనైనా గేట్లు ఎత్తివేసే అవకాశం**

కామారెడ్డి బ్యూరో:/సెప్టెంబర్ 23/(జన సంఘర్షణ)




కామారెడ్డి జిల్లా కౌలాస్ నాలా ప్రాజెక్ట్ పరివాహక ప్రాంతంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాబోయే 24 గంటల్లో ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లోలు పెరిగే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.ఇన్‌ఫ్లో పరిస్థితులను బట్టి ప్రాజెక్ట్ వరద గేట్లను ఎత్తి అదనపు నీటిని కౌలాస్ నాలా వాగులోకి విడుదల చేయాల్సి రావచ్చని అధికారులు హెచ్చరించారు.బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో కౌలాస్ నాలా ప్రాజెక్ట్‌లో నీటిమట్టం 457.83 మీటర్లుగా నమోదైంది. ప్రాజెక్ట్ గరిష్ఠ నీటి నిల్వ మట్టం 458.00 మీటర్లుగా ఉంది.దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలిప్రాజెక్ట్ దిగువ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాగులోకి, వాగు పరిసర ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లవద్దని హెచ్చరించారు. ముఖ్యంగా చేపలు పట్టేవారు, పశువులు, గొర్రెల కాపరులు, రైతులు వాగు వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసే పరిస్థితి ఏర్పడితే ముందస్తుగా హెచ్చరికలు జారీ చేసి, నీటి విడుదల సమయం, డిశ్చార్జి వివరాలను ప్రజలకు తెలియజేస్తామని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.అలాగే మంజీరా పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, వాగులు, నదులు, నీటి ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లకుండా అధికారుల సూచనలు పాటించాలని అధికారులు సూచించారు.ప్రజల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

## గణేశ్ నిమజ్జనాలు, భారీ వర్షాల నేపథ్యంలో పలు జిల్లాల్లో స్కూళ్లకు సెలవులు

**హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఎల్లుండి స్కూళ్లు, కాలేజీలకు సెలవు**

హైదరాబాద్/సెప్టెంబర్ 23/(జన సంఘర్షణ)



హైదరాబాద్: గణేశ్ నిమజ్జనాలు, భారీ వర్షాల నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు.ఎల్లుండి గణేశ్ నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని స్కూళ్లు, కాలేజీలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ సెలవుకు బదులుగా నవంబర్ 14న (రెండో శనివారం) వర్కింగ్ డేగా నిర్వహించనున్నట్లు తెలిపింది.మరోవైపు భారీ వర్షాల నేపథ్యంలో రేపు ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం, తెలంగాణలోని మహబూబాబాద్, భద్రాద్రి జిల్లాల్లో స్కూళ్లకు సెలవు ప్రకటించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సంబంధిత విద్యాశాఖ అధికారులు, పాఠశాల యాజమాన్యాల సూచనలు పాటించాలని అధికారులు సూచించారు.

## ధర్మారావుపేట, అమర్లబండలో డీజేలు సీజ్ చేసిన ఎస్ఐ పుష్పరాజ్

**పోలీసు నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులపై కేసులు నమోదు**

కామారెడ్డి బ్యూరో:/సెప్టెంబర్ 23/(జన సంఘర్షణ)




వినాయక నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతి లేదని పోలీసులు ముందస్తుగా స్పష్టంగా హెచ్చరించినప్పటికీ, నిబంధనలు ఉల్లంఘించి డీజేలు వినియోగించిన వారిపై సదాశివనగర్ పోలీసులు చర్యలు చేపట్టారు.కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల పరిధిలోని ధర్మారావుపేట, అమర్లబండ గ్రామాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా అనుమతులు లేకుండా డీజేలను వినియోగించడంతో వాటిని పోలీసులు సీజ్ చేశారు. డీజే ఆపరేటర్లపై కేసులు నమోదు చేశారు.అదేవిధంగా పోలీసుల సూచనలు, నిబంధనలను ఉల్లంఘిస్తూ డీజేలను ఏర్పాటు చేసిన గణేష్ మండపాల నిర్వాహకులు, వారికి సహకరించిన వ్యక్తులపైనా కేసులు నమోదు చేసినట్లు సదాశివనగర్ ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు.గణేష్ మండపాల నిర్వాహకులు, నిమజ్జన నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించి ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని ఎస్ఐ సూచించారు.నిబంధనలు ఉల్లంఘించి ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా డీజేలు లేదా ఇతర శబ్ద పరికరాలను వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పుష్పరాజ్ హెచ్చరించారు.

# బాన్సువాడలో ఆటో బోల్తా.. యువతి మృతి






**అతివేగమే ప్రమాదానికి కారణం.. కేసు నమోదు చేసిన పోలీసులు**

బాన్సువాడ, సెప్టెంబర్ 23/(జన సంఘర్షణ):

బాన్సువాడ మండలంలో ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ యువతి మృతి చెందింది. ఈ ప్రమాదం బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మద్‌నగర్ మండలం సింగీతం గ్రామానికి చెందిన కంచం ఇందు (21) బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో బగవాన్ బాబాకు చెందిన ఏపీ 28 టీబీ 4201 నంబర్ ఆటోలో సింగీతం నుంచి బాన్సువాడ వైపు వస్తోంది. మార్గమధ్యంలోని కొయ్యగుట్ట వద్ద ఆటో డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇందుకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తల్లి కంచం లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ తుల శ్రీధర్ తెలిపారు.

# తుడుందెబ్బ సీనియర్ నాయకులు కీర్తి శేషులు మడకం సూర్యనారాయణ

**31 వ వర్ధంతి వేడుక**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, సెప్టెంబర్ 23(జనాసంఘర్షణ):



చర్ల మండలం తుడుందెబ్బ ఆఫీస్ ప్రాంగణంలో తుడుందెబ్బ నాయకులు కీర్తి శేషులు మడకం సూర్యనారాయణ కి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ ఎంప్లాయిస్ రాష్ట్ర నాయకులు సరేం సమ్మయ్య మాట్లాడుతూ,ఈ రోజు ఈ కార్యక్రమం చేస్తున్న తుడుందెబ్బ కమిటీకి ధన్యవాదములు అని చెపుతూ, చర్ల సెంటర్ లో మన ఆదివాసీ లకు ఆఫీస్ ఉందంటే దానికి కారణం మడకం సూర్యనారాయణ, మడప లక్షణ్ రావు ఈ విషయన్ని భవిష్యత్ తరాలు గుర్తు పెట్టుకోవాలని అలాగే చర్ల మండలం లో ఆదివాసీల కోసం కృషి చేసిన వ్యక్తి అని అన్నారు. ఈరోజు తుడుందెబ్బ ఆఫీస్ ఉండటం వల్ల కోమరం భీమ్ విగ్రహం ఏర్పాటు చేసి జాతి అస్థిత్వాన్ని కాపాడరని ఈ సందర్భంగా అన్నారు. అలాగే నినాదాలు చేసి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమం లో తుడుందెబ్బ సీనియర్ నాయకులు తాటి రామకృష్ణ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్ మండల అధ్యక్షులు పూనెం రవికిరణ్ సహాయ కార్యదర్శి తాటి శ్రీను ఆదివాసీ సీనియర్ నాయకులు మడకం రాము తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కారం నరేష్, నాయి బ్రాహ్మణ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంద్రేటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

# తాళ్లరాంపూర్‌లో 49 కుటుంబాల సాంఘిక బహిష్కరణ?

- **గ్రామాభివృద్ధి కమిటీ ఆంక్షలు.. మాట్లాడినా, సరుకులు ఇచ్చినా రూ.25 వేల జరిమానా విధించారంటూ బాధితుల ఆరోపణలు**

నిజామాబాద్/, సెప్టెంబర్ 23/:(జన సంఘర్షణ)



ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో 49 కుటుంబాలను గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) సాంఘిక బహిష్కరణ చేసినట్లు బాధితులు ఆరోపించారు. గ్రామంలో ఈ తరహా బహిష్కరణ జరగడం ఇది రెండోసారి అని వారు తెలిపారు.సాంఘిక బహిష్కరణకు గురైన కుటుంబాలతో గ్రామంలో ఎవరూ మాట్లాడకూడదని, కిరాణా దుకాణాల్లో సైతం వారికి నిత్యావసర సరుకులు విక్రయించకుండా వీడీసీ ఆంక్షలు విధించినట్లు బాధితులు పేర్కొన్నారు.అంతేకాకుండా బహిష్కరణకు గురైన కుటుంబాలతో ఎవరైనా మాట్లాడినా, వారికి నిత్యావసర సరుకులు అందించినా రూ.25 వేల జరిమానా విధిస్తామని వీడీసీ ఆదేశాలు జారీ చేసినట్లు బాధితులు ఆరోపించారు.ఈ ఆంక్షల కారణంగా తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం –– 'వన్ హెల్త్.. వన్ ఫ్యూచర్'

**బాన్సువాడలో 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం.. ప్రకృతితో మమేకమై జీవించాలని వైద్య నిపుణుల పిలుపు**

బాన్సువాడ:/సెప్టెంబర్ 23/ (జన సంఘర్షణ)

భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ, తెలంగాణ రాష్ట్ర ఆయుష్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాల మేరకు బాన్సువాడ ఆయుష్ విభాగం, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం, ప్రభుత్వ యునాని వైద్యశాల ఆధ్వర్యంలో 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఆయుర్వేద వారోత్సవాల ముగింపులో భాగంగా బుధవారం యోగా కేంద్రంలో ఉదయం యోగా అనంతరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా శిక్షకులు వొట్లం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 23ను ఆయుర్వేద దినోత్సవంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ఏడాది అధికారిక థీమ్ 'ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం', ట్యాగ్‌లైన్ 'వన్ హెల్త్.. వన్ ఫ్యూచర్' అని పేర్కొన్నారు.యోగా, ఆయుర్వేద వైద్య విధానాలను ఆధునిక వైద్యంతో సమన్వయం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.పిల్లల వైద్యులు డా. ప్రకాష్ మాట్లాడుతూ మెరుగైన ఆరోగ్యం కోసం ఆధునిక వైద్యంతో పాటు ఆయుర్వేద వైద్య విధానాన్ని కూడా స్వీకరించాలని సూచించారు. ప్రకృతితో మమేకమై జీవిస్తూ, కాలానుగుణ ఆహారపు అలవాట్లపై దృష్టి సారించాలని, పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఆసుపత్రి ఆర్ఎంఓ డా. సుజాత, హెడ్ నర్స్ అమృతలత, ఆత్మ కమిటీ చైర్మన్ మాసాని రవీందర్ రెడ్డి, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు కాసుల రోహిత్, సుల్తానా గౌస్, అశోక్ రెడ్డి, షోయబ్, అన్వర్, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co